
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
శనివారం 20, జూలై 2024

- దొనకొండ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి అడుగులు
- ప్రస్తుతం ప్రజల్లో హాట్ టాపిక్
- భోగాపురంలో సీఎం, కేంద్రమంత్రితో ఎయిర్‌పోర్టు అధికారుల చర్చ
- కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించిన ఆర్డీవో
- పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు
- వైసీపీ పాలనలో అడుగు ముందుకు పడని వైనం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ తెరపైకి



నెరవేరనున్న విమానం కల

జిల్లావాసుల విమానం కల ఎట్టకేలకు నెరవేరబోతోంది. దొనకొండ విమానాశ్రయం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్టు అప్పట్లో ఓ వెలుగువెలిగింది. యుద్ధ అవసరాల కోసం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నా 1960 వరకూ వినియోగంలో ఉంది. ఆతర్వాత దానిని పట్టించుకోలేదు. జిల్లా అభివృద్ధిలో కీలకమైన దొనకొండ ప్రాంతానికి విమానాశ్రయం వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎప్పటినుంచో ఇదే విషయాన్ని ఆ ప్రాంత వాసులు చెబుతూ వస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు నిర్లక్ష్యం చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం వెంటనే ఎయిర్‌పోర్టుపై దృష్టి పెట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ఆర్డీవో విమానాశ్రయ భవనాలు, భూములను పరిశీలించి నివేదిక సమర్పించారు. దీంతో అక్కడ త్వరలో విమానం ఎగరడం ఖాయమన్న అంచనాకు ఆ ప్రాంతవాసులు వచ్చేశారు.


దొనకొండలో బ్రిటీష్‌కాలంలో నిర్మించిన విమానాశ్రయం

కూటమి ప్రభుత్వంలో కదలిక

దొనకొండలో విమానాశ్రయ అభివృద్ధికి పలు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారం చేపట్టింది. దీంతో ఈ అంశాలన్నీ జగన్‌మోహన్‌రెడ్డి తొక్కిపెట్టారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే దొనకొండ విమానాశ్రయం అభివృద్ధిపై కదలికలు రావడం ప్రజల్లో చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో రానున్న రోజుల్లో దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతోపాటు అందుకు సౌకర్యవంతంగా విమానాశ్రయం సైతం అభివృద్ధి చెందుతుందని అందరూ భావిస్తున్నారు. దొనకొండలో విమానాశ్రయం ఏర్పాటైతే పశ్చిమ ప్రకాశంలో నూతనంగా ఏర్పడే మార్కాపురం జిల్లా ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ప్రజలు చర్చించుకోవడం ప్రారంభించారు.

దొనకొండ, జూలై 19 : దొనకొండలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇటీవల భోగాపురం విమానాశ్రయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సమక్షంలో అధికారులు దొనకొండ విమానాశ్రయం గురించి వివరించటంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీని అభివృద్ధికి వెయ్యి ఎకరాల భూమి కేటాయిస్తామని ఎయిర్‌పోర్ట్ అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ క్రమంలోనే కలెక్టర్ ఆదేశాల మేరకు కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ మంగళవారం దొనకొండ విమానాశ్రయం భవనం, అందుకు సంబంధించిన భూములను పరిశీలించారు. పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలంటూ రెవెన్యూ సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అందరి దృష్టి దొనకొండ విమానాశ్రయం అభివృద్ధిపైనే పడింది. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం దీనిపై ఏమాత్రం దృష్టి పెట్టకపోవడం, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్దిరోజులకే దీని అభివృద్ధికి కదలికలు ప్రారంభమవడం గురించి ప్రజలు చర్చించుకుంటున్నారు.


విమానాశ్రయం భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ (ఫైల్)

1960 నుంచి నిరుపయోగం

1934లో బ్రిటీష్ పాలకులు మద్రాస్, హైదరాబాద్‌కు మధ్యలో ఉన్న దొనకొండను గుర్తించి 136.50 ఎకరాల విస్తీర్ణంలో టెర్మినల్, నిర్వహణ భవనాలతో విమానాశ్రయాన్ని నిర్మించారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో విమానాల్లో ఇంధనం నింపుకునేందుకు, ఆయుధాల తరలింపునకు బ్రిటీష్ వారు దీనిని ఉపయోగించుకున్నారు. 1960 తర్వాత దొనకొండకు విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో అప్పటినుంచి నిరుపయోగంగా మారింది. ఎయిర్‌పోర్టు అథారిటీ వారు దాదాపు పదేళ్ల క్రితం రూ.40 లక్షల వ్యయంతో చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, నేటికీ ఇన్‌చార్జిగా ఒక ఉద్యోగి ఇక్కడ విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

గత టీడీపీ ప్రభుత్వంలోనే దృష్టి

2014లో అధికారం చేపట్టిన అనంతరం దొనకొండను పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించారు. కారిడార్‌కు అనుసంధానంగా విమానాశ్రయం ఏర్పాటు నిమిత్తం అప్పటి భోగాపురం ఎయిర్‌పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు దొనకొండ విమానాశ్రయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ 15 సీట్ల మినీ విమానాలు రన్‌వేపై దిగడానికి సౌకర్యవంతమని ప్రభుత్వానికి నివేదించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రాంతీయ అనుసంధాల పథకాలకు దొనకొండలోని విమానాశ్రయం ఎంపికైంది. అప్పటి గన్నవరం ఎయిర్‌పోర్టు అథారిటీ సహాయ మేనేజర్ సురేష్ బృందం విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించింది. ఉన్న 136 ఎకరాలతోపాటు మరో 340 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. రెవెన్యూ అధికారులు నరసింహనాయునిపాలెం, ఇండ్లచెరువు రెవెన్యూ పరిధిలోని 340 ఎకరాల భూములను అప్పట్లో ఎంపిక చేశారు. మొత్తం 1,575 మీటర్ల పొడవున రన్‌వే ఏర్పాటుకు ప్రాథమిక సర్వే చేపట్టారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు అనంతరం ఈప్రాంత డిమాండ్‌ను బట్టి ప్రయాణికుల విమానాల రాకపోకలు జరుగుతాయని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు సర్వే విభాగం అసిస్టెంట్ మేనేజర్ ఆరివోలి బృందం దొనకొండలో ఉన్న 136 ఎకరాలు, అదనంగా గుర్తించిన 340 ఎకరాల్లో విమానం సేఫ్ ల్యాండింగ్ నిమిత్తం రన్‌వే ఏర్పాటుకు స్థానిక సిబ్బందితో కలిసి వారంరోజులు సర్వే నిర్వహించారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని అప్పట్లో వారు ప్రకటించారు.


ఆర్అండ్‌బీ రోడ్డు, ఎన్నెస్పీ కాలువను పూడ్చి ఏర్పాటు చేసిన తూము

రూ.2 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ

- సాగర్ కాలువను పూడ్చి తూములు ఏర్పాటు చేసిన వైసీపీ నేతలు
- పొలాలకు నీరందక రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

తాళ్లూరు, జూలై 19 : గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కాలువలను కూడా వదల్లేదు. తూర్పుగంగవరం-దర్శి ఆర్అండ్‌బీ మార్గంలో బెల్లంకొండవారిపాలెం సమీపాన ఆర్అండ్‌బీ రోడ్డును అనుకుని ఉన్న ఎన్నెస్పీ కాలువ (పిల్లకాలువ), ఆర్అండ్‌బీకి చెందిన స్థలాన్ని ఆక్రమించారు. 70 సెంట్ల ఆర్అండ్‌బీ స్థలంతోపాటు, 400 మీటర్ల మేర సాగర్ మైనర్ కాలువకు చెందిన దాదాపు ఎకరన్నర స్థలంలో పాగా వేశారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఆక్రమించిన స్థలం విలువ దాదాపు రూ.2 కోట్ల పైమాటే. దర్శి ఆర్అండ్‌బీ రోడ్డు మార్గంలో బెల్లంకొండవారిపాలెం సమీపాన ఉన్న సాగర్ కాలువ అవతలి వైపు దాదాపు 15 ఎకరాల భూమిని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన వైసీపీ నేతలు కొనుగోలు చేశారు. తాము కొన్నపొలంలో ప్లాట్లు వేసేందుకు వెంచర్ సిద్ధం చేస్తూ పొలానికి, ఆర్అండ్‌బీ రోడ్డుకు మధ్యలో ఉన్న బెల్లంకొండవారిపాలెం పిల్ల కాలువను 400 మీటర్ల ఆక్రమించి ఆర్అండ్‌బీకి సమాంతరంగా చదును చేశారు. సాగర్ కాలువ ద్వారా దిగువ ఆయకట్టుకు నీరు వెళ్లేందుకు ఆక్రమణదారులు చిన్న తూములు ఏర్పాటుచేశారు. సాగర్ కాలువ ఆనవాళ్లు లేకుండా తూములపై మట్టిపోసి పొలాన్ని ప్లాట్లుగా చేసేందుకు సిద్ధంచేశారు. బెల్లంకొండవారిపాలెం మైనర్ కాలువకింద 120 ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువను పూడ్చివేయడంతో సాగర్ జలాలు దిగువకు ప్రవహించే వీలు లేకుండా పోయింది. దీంతో తమ పొలాలకు సాగర్ జలాలు అందవని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ కాలువకు అనుకుని ఉన్న 70సెంట్ల ఆర్అండ్‌బీ రోడ్డును కూడా చదును చేశారు. ఆ రోడ్డు వెనుక ఉన్న ఆక్రమణదారుని పొలాల్లోకి ఈ స్థలంలో నుంచే వెళ్లాలి. ప్లాట్లు వేసి అమ్ముకునేందుకు అనువుగా ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి మట్టి తోలి చదును చేశారు. వైసీపీ నాయకులు ఆక్రమించి చదును చేసిన ఆర్అండ్‌బీ స్థలం, ఎన్నెస్పీ కాలువ స్థలం ధర దాదాపు రూ.రెండు కోట్ల మేర ఉంటుందని అంచనా. ఎన్నెస్పీ కాలువను, ఆర్అండ్‌బీ స్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించినా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించారు. వెంటనే ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని బెల్లంకొండవారిపాలెం టీడీపీ నాయకుడు రాచకొండ వెంకట్రావు ఆ శాఖల ఉన్నతాధికారులకు పది రోజుల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైనర్‌కాలువ, ఆర్అండ్‌బీ స్థలంలోని ఆక్రమణలు తొలగించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఆక్రమించి చదును చేసిన ఆర్అండ్‌బీ స్థలం

జిల్లాకు జ్వరం

- నాలుగువేల మందికిపైగా బాధితుల గుర్తింపు
- అనధికారికంగా పదివేల మందికిపైనే
- ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్దకు పరుగులు
- వైద్య పరీక్షల పేరుతో భారీగా దోపిడీ

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 19 : జిల్లాలో వాతావరణంలో మార్పులు రావడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసినా అధికార యంత్రాంగం పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయింది. వారం నుంచి జ్వరాలతో ప్రజానీకం అల్లాడిపోతోంది. స్థానికంగా ప్రభుత్వ వైద్యశాలలు ఉన్నా అక్కడకు వెళ్లేందుకు మొగ్గుచూపడం లేదు. జ్వరం వచ్చిందంటే ముందుగా ఆర్ఎంపీల వద్దకు వెళ్లి చూపించుకుంటున్నారు. మూడు రోజుల తర్వాత కూడా తగ్గకపోతే ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు.

అలా వైద్యశాఖ లెక్కల ప్రకారం జిల్లావ్యాప్తంగా సుమారు నాలుగువేల మందికిపైగా జ్వర పీడితులు ఉన్నట్లు సమాచారం. అనధికారికంగా జ్వరం, ఒళ్లునొప్పులు, కాళ్లనొప్పులు వంటి వాటితో పదివేల మందికి పైగా బాధపడుతున్నారని అంచనా.

టెస్టుల పేరుతో బాదేస్తున్నారు

ఆర్ఎంపీల వద్ద జ్వరం తగ్గకపోతుండటంతో బాధితులు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. అక్కడకు వెళ్లిన వెంటనే రకరకాల టెస్టులు చేయించాలని రాసి ఇస్తున్నారు. దీంతో వైద్య పరీక్షల (టెస్టుల) కోసం ప్రజానీకం అధికంగా వెచ్చించాల్సి వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. రక్తపరీక్ష, డెంగ్యూ, మలేరియా, ఇతర రకాల టెస్టుల పేరుతో ల్యాబ్‌లో రూ.వేలు వసూలు చేస్తున్నారు. అలా జిల్లావ్యాప్తంగా ఈ వ్యవహారం కొనసాగుతున్నా పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండాపోయింది. సాధారణంగా ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లిన జ్వరపీడితుల డేటా కూడా నమోదు చేయాల్సి ఉంది. అనేక ప్రాంతాల్లో దాని గురించి పట్టించుకోకపోవడంతో జిల్లాలో ఎంతమంది జ్వరపీడితులు ఉన్నారో కూడా వైద్యశాఖ చెప్పలేకపోతోంది. వైద్యారోగ్యశాఖ క్షేత్రస్థాయిలో వ్యాధుల తీవ్రతపై నిరంతరం సర్వే చేసి దాని ఆధారంగా ఎవరైనా అంటువ్యాధులతో బాధపడుతుంటే వారికి వైద్యసేవలు అందించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వైద్యశాఖ పట్టించుకుంటున్న పరిస్థితి లేకపోవడంతో ప్రజానీకం వైద్యం కోసం బయటకు పరుగులు తీస్తున్నారు.


ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు


సమావేశంలో పాల్గొన్న పొగాకు బోర్డు పాలక మండలి సభ్యులు, అధికారులు

105.27 మిలియన్ కిలోలు

- వచ్చే సీజన్‌కు దక్షిణాదిలో పంట ఉత్పత్తి లక్ష్యం ఇదీ
- ఖరారు చేసిన పొగాకు బోర్డు
- గతేడాది కన్నా 16.40 మిలియన్ కిలోలు అధికంగా అనుమతి

ఒంగోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రానున్న సీజన్‌కు రాష్ట్రంలో పొగాకు పంట ఉత్పత్తి లక్ష్యాన్ని బోర్డు ఖరారు చేసింది. 167 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతిచ్చింది. అందులో దక్షిణాదిలో 105.27 మిలియన్ కిలోలు ఉంది. గడిచిన సీజన్‌తో పోల్చితే రాష్ట్రంలో 25 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి లక్ష్యం ఖరారు చేయగా దక్షిణాదికి 16.40 మిలియన్ కిలోలు అదనంగా ఇచ్చింది. గుంటూరులోని పొగాకుబోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, కార్యదర్శి దివి వేణుగోపాల్, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బోర్డు సభ్యులు, వివిధ స్థాయిల్లోని అధికారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి బోర్డు డైరెక్టర్లుగా ఉన్న పొద వరప్రసాదరావు, బొడ్డపాటి బ్రహ్మయ్య హాజరయ్యారు. గత సీజన్‌కు రాష్ట్రంలో ఇచ్చిన పంట అనుమతి, వచ్చిన ఉత్పత్తి, ఇప్పటి వరకూ జరిగిన కొనుగోళ్లతోపాటు అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్ భవిష్యత్, డిమాండ్, భారత పొగాకు వ్యాపారుల సంఘం ఇచ్చిన ఇండెంట్‌తో పాటు రైతులు కోరుతున్న ఉత్పత్తి అనుమతి లక్ష్యాలను చర్చించినట్లు సమాచారం

భారీగా పెరిగే అవకాశం

గడిచిన సీజన్‌లో రాష్ట్రంలో 142 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతించగా ఒక్క దక్షిణాదిలోనే ఇంచుమించు 140 మిలియన్ కిలోల మేర పంట పండింది. ఉత్తరాదిలో మరో 60 మిలియన్ కిలోలు వెరసి 200 మిలియన్ కిలోలు వచ్చినట్లు సమాచారం. అదేసమయంలో రైతులు బ్యారన్‌కు 50 క్వింటాళ్ల మేర అనుమతి ఇవ్వాలని కోరుతూ వస్తున్నారు. గతంలో దక్షిణాదిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్ల అనుమతివ్వగా ప్రస్తుతం కోరుతున్న 50 క్వింటాళ్లు ఇస్తే ఇంకా భారీగా పంట ఉత్పత్తి పెరిగే పరిస్థితి ఉంది. దీంతో ఇటు రైతులు కోరిన మేర ఇవ్వకుండా, అటు గతం కన్నా కొంతమేర పెంచుతూ 167 మిలియన్ కిలోలు ఉత్పత్తి లక్ష్యాన్ని ఖరారు చేశారు. అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉన్న 11 వేలం కేంద్రాలకు సంబంధించి రెండు రీజియన్లలో 105.27 మిలియన్ కిలోలకు అనుమతిచ్చారు. గడిచిన సీజన్‌లో ఈ ప్రాంతంలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్ల వంతున రెండు రీజియన్లలో కలిపి 88.87 మిలియన్ కిలోలకు అనుమతి ఇచ్చారు. అయితే ఇక్కడ 29,885 మంది రైతులు 24,130 బ్యారన్లకు లైసెన్సులు పొంది దాదాపు 72,345 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. దీంతో ఏకంగా 140 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అయింది. ఇప్పటివరకు సుమారు 91 మిలియన్ కిలోలు కొనుగోలు చేశారు. అధికంగా ఉత్పత్తి అయిన మరో 49 మిలియన్ కిలోల కొనుగోలుకు కేంద్రం నుంచి అనుమతి రాక వేలం నిలిచిపోయి రైతుల ఇళ్లలో పంట ఉంది. ఈ నేపథ్యంలో రైతులు కోరిన బ్యారన్‌కు 50 క్వింటాళ్ల ఉత్పత్తి అనుమతిని బోర్డు సభ్యులు అంగీకరించలేదు. అదేసమయంలో గతంలో ఇచ్చిన 36.50 క్వింటాళ్లను పెంచారు. తాజా లక్ష్యంలో ఎస్‌బీఎస్ రీజియన్‌లో బ్యారన్‌కు 41.75 క్వింటాళ్ల వంతున 49.26 మిలియన్ కిలోలు, ఎస్‌ఎల్‌ఎస్ రీజియన్‌లో బ్యారన్‌కు 42.75 క్వింటాళ్ల వంతున 56.01 మిలియన్ కిలోలు వెరసి దక్షిణాదిలో 105.27 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు సమావేశంలో అనుమతించారు.

ఇకనైనా శవరాజకీయాలు

మానుకో జగన్

- వినుకొండ ఘటనపై మంత్రి స్వామి ఫైర్



ఒంగోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వినుకొండలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన హత్యను వైసీపీ అధ్యక్షుడు జగన్ టీడీపీకి ఆపాదిస్తున్నాడని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. ఆమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసిన స్వామి అసలు వినుకొండలో రషీద్ హత్యకు ముఖ్య కారకుడు జగన్ అన్నారు. హతుడు రషీద్, నిందితుడు జిలానీల మధ్య వైసీపీ హయాంలోనే గొడవలు జరిగాయన్నారు. ఆనాడే వాటిని నియంత్రించి ఉంటే ఇప్పుడు ఈ హత్య జరిగేదా? అని ప్రశ్నించారు. నాడు జగన్ చేసిన పాపానికి నేడు నిండు ప్రాణం బలైందన్నారు. సొంత బాబాయిని చంపించి దానిపై నారాసుర రక్త చరిత్ర అంటూ టీడీపీపైనా, చంద్రబాబు నాయుడుపైనా దుష్ప్రచారం చేసిన నీచచరిత్ర జగన్‌ది అన్నారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. వైసీపీ హయాంలో వేలాదిమందిపై దాడులు, హత్యలు జరిగాయన్నారు. ఆ సమయంలో బాధితులను పరామర్శించేందుకు ప్రతిపక్ష నాయకులను వెళ్లనీయకుండా పోలీసులను అడ్డుపెట్టి జగన్ నియంతృత్వంగా వ్యవహరించాడన్నారు. అయితే ప్రస్తుతం టీడీపీ పాలనలో జగన్ స్వేచ్ఛగా తన పర్యటనను తాను చేసుకునేలా అవకాశం కల్పించామని తెలిపారు. ప్రజలు కూడా నాడు వైసీపీ, నేడు టీడీపీ ప్రభుత్వాల మధ్య తేడాను గుర్తించాలని కోరారు. వ్యక్తిగత కక్షలతో తాజాగా జరిగిన సంఘటనలను టీడీపీకి ఆపాదిస్తూ రాజకీయ లబ్ధికోసం జగన్ చేస్తున్న శవ రాజకీయాలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే ప్రజలు శాశ్వతంగా రాజకీయాల నుంచి మాన్పిస్తారని హెచ్చరించారు.

దుంగల దొంగలు దొరికారు!

- ముగ్గురు అరెస్టు
- 28 చందనం దుంగలు, కారు స్వాధీనం

కొమరోలు, జూలై 19 : ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద 28 దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ స్టేషన్ సీఐ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమరోలు మండలం అక్కపల్లి గ్రామ సమీపంలోని రాష్ట్రీయ రహదారి పక్కన కారులో ఎర్రచందనపు దుంగలు తరలిస్తుండటంతో ముగ్గురిని కడప సబ్‌కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ సురేష్ టీం, అటవీ శాఖ సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉంచిన 17దుంగలు, కింద ఉన్న 11 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వారు ఉపయోగించిన కారును సీజ్ చేసి తిరుపతి టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులకు తమిళనాడు స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించి ఆ దిశగా విచారిస్తున్నారు.


నిందితులతో అటవీశాఖ అధికారులు

ఉసురుతీసిన ఈత సరదా

- వల్లూరు చెరువులోకి దిగి ఇద్దరు యువకుల గల్లంతు
- సెల్‌సిగ్నల్స్ ఆధారంగా గుర్తింపు
- ఒకరి మృతదేహం వెలికితీత


చెరువు కుంటలో గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

లోపలి పేజీల్లో..

వెంటాడుతున్న వ్యాధుల భయం..!

- మాటేసిన మలేరియా మహమ్మారీ
- కనిపించని దోమలపై దండయాత్ర
- పెరుగుతున్న వైరల్ ఫీవర్ బాధితులు
- పేరుకే కార్మికులు.. పెత్తనానికే పరిమితం
- పారిశుధ్యం మెరుగు ఏరోజుకారోజే..


పులివెంకటరెడ్డి కాలనీలో నిలిచిన మురుగు


కొప్పోలురోడ్డులో నిలిచిన వర్షపునీరు


రాజీవ్‌గృహకల్ప కాలనీలో అధ్వానంగా డ్రైనేజీ కాలువ

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 19: ప్రజారోగ్యంపై కార్పొరేషన్ యంత్రాంగం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుంది. పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో ఒంగోలు నగరం కంపుకొడుతున్నది. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో నగరపాలక సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రస్తుతం వాతావరణంలోని మార్పులతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దోమల దాడులతో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకు వందల సంఖ్యలో కార్మికులు ఉన్నా, సగం మంది మేస్త్రీలు, మరి కొంతమంది ఆర్డరు లేకుండా అటెండర్లుగా తిష్టవేసి, పారిశుధ్య పనులకు ముఖం చాటేస్తున్నారు. ఇదిలా ఉంచితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ పెద్దల ఆశీసులతో అసలు పనులకే రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. దీంతో నగర హోదాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు ఉన్నా, ఉపయోగం లేకుండా పోతుంది. దీంతో నగరంలో పారిశుధ్య సమస్యకు పరిష్కారం లభించడం లేదు. సాధారణ రోజుల్లో పరిస్థితి ఎలా ఉన్నా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యాధుల భయం వెంటాడుతుంది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకుంటే తప్ప పారిశుధ్యం మెరుగు పడి, వ్యాధుల నుంచి బయటపడే పరిస్థితి కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

వ్యాధుల వ్యాప్తికి అనుకూల వాతావరణం

వర్షాకాలం అంటేనే వ్యాధుల భయం. దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. వార్డులో పర్యటించి, నీటి న్విలలు లేకుండా, ఇళ్ల మధ్య మురుగు కనిపించకుండా, ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. అంతేగాకుండా నగరంలో అవగాహన ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాల్సి ఉండగా అలాంటి వాతావరణం ఎక్కడా కనిపించడం లేదు.

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి..

విష జ్వరాలను నివారించేందుకు ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలి. వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇంటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై అవగాహన కల్పించాలి. ప్రతి రోజు కాలువల్లో మురుగు తొలగింపు, తడి చెత్త నిల్వ లేకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలలో, కాలువల్లో దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మురుగునీటిలో గంబూషియా చేపలు విడుదల చేయాలి. వృద్ధి చెందని దోమలను అంతం చేసేందుకు అబెట్, పైరిత్రిమ్, మలాథియన్‌తో స్రే, మలాథ్రియన్ ద్రావణంతో ఫాగింగ్ చేయాలి. వాటితోపాటు ప్రతి వీధిలోనూ చెత్తను తొలగించిన పిదప బ్లీచింగ్ చల్లి పరిశుభ్రమైన వాతావరణం కనిపించేలా చూడాలి. కానీ ఇలాంటి పరిస్థితి ఆచరణలో కనిపించడం లేదు.

సరిపడా సిబ్బంది ఉన్నా..

ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉండగా, 61,694 గృహాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగుకు సిబ్బంది వందల్లోనే ఉన్నారు. ఉదయం 5-30 నుంచి రూ.10-30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, రాత్రి వేళలో 9గంటల నుంచి వేకువ జామున 5గంటల వరకు వీధులు శుభ్రం చేస్తారు. అందుకోసం ఒక శానిటరీ సూపర్ వైజర్ పర్యవేక్షణలో ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 122 మంది రెగ్యులర్ పీహెచ్ వర్కర్లు, 681 మంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. మరో 100 మంది కొవిడ్ సేవల పేరుతో పనిచేస్తున్నారు. అయితే వీరంతా చీపురు పట్టడానికి, చెత్త ఎత్తడానికి మాత్రం రాలేమంటూ పలుకుబడితో కార్యాలయాల్లో, కార్పొరేటర్ల వద్ద తిష్ట వేశారు. దీంతో పారిశుధ్యం ఏరోజుకారోజే అన్నట్లు కనిపిస్తుంది. నగరంలో సేకరించిన చెత్తను తరలించేందుకు 60కి పైగా చెత్త సేకరణ ఆటోలు, వాటితో పాటు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఒక డంపర్ ప్లేజర్, ఒక పెద్ద ఫాగింగ్ మిషన్, మరో ఆరు ఫాగింగ్ మిషన్లు, పది స్ప్రేయర్లు ఉన్నాయి. కానీ వాటిని ఆయా కాలాలకు అనుగుణంగా ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.



మలేరియా వ్యాప్తి ఇలా...

మలేరియా జ్వరం చాపకింద నీరులా వ్యాపిస్తుంది. నాలుగు రకాలుగా ఉండే ఈ వ్యాధి అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు మలేరియా బాధితులు ఎక్కువ. నాలుగు రకాలుగా ఉండే మలేరియా జ్వరంలో మొదటిది ప్లాస్మోడియం వైవాక్స్, (పీవీ), ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ (పీఎఫ్), ప్లాస్మోడియం ఓవెల్, ప్లాస్మోడియం మలేరియా. వీటిలో అధికంగా సోకేది పీవీ, పీఎఫ్. ఇవి సోకితే రోజు మార్చి రోజు గజగజ వణికించే చలిజ్వరం, తలనొప్పి, చెమటలు పట్టడం, ఒళ్ళునొప్పులు, రక్తహీనత కనిపిస్తాయి. ఈ జ్వరం సోకిన 10 నుంచి 15 రోజుల్లో రక్త పరీక్షల ద్వారా మలేరియా బయటపడుతుంది.



నీటి కాలుష్యంతో ముప్పు..

నీటి కాలుష్యం కారణంగా డయేరియా, పచ్చకామెర్లు, వైరల్ జ్వరాలు, చికెన్‌పాక్స్, పిల్లల్లో మీజిల్స్, నీళ్ల విరేచనాలు గవదబిళ్ళలు, పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ. ప్రస్తుతం చెరువుల్లో కొత్తగా వస్తున్న నీటిని అధికార యంత్రాంగం కొళాయిల ద్వారా గృహాలకు విడుదల చేయడంతో రోగాలు మరింతగా వచ్చే అవకాశం ఉంది. అయితే కొళాయిల ద్వారా వచ్చే నీటిని ఏరోజుకారోజు నీటి పరీక్షలు చేయాలి. అయితే యంత్రాంగం కొన్ని ప్రాంతాలలో నీటిశుద్ధి లేకుండా అలాగే వదిలేయడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు.

ప్రభుత్వ సేవలను పటిష్టంగా అమలు చేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్) జూలై 19: జిల్లాలో ప్రభుత్వ సేవలను పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం రిజిస్ట్రేషన్, కమర్షియల్, ట్రెజరీ, ఆడిట్, ఎండోమెంట్‌శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ సేవలను పటిష్టంగా అమలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అధికారులు పుష్పలత, ఉపేంద్ర, కె.కరీం బాషా, జగన్నాథరావు, నాగశ్రీనివాసరావు, శంకర్‌నారాయణరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల గడువు 25 వరకు పెంపు

ఒంగోలు(విద్య), జూలై 19: ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం మూడోసారి పొడిగించింది. ఆన్‌లైన్ కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్‌కు మొదట ఈనెల 12న తుది గడువు ప్రకటించగా, రెండోసారి ఈనెల 20వ తేదీ వరకు పొడిగించారు. తాజాగా మూడోసారి రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 25 వరకు పెంచుతూ ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించింది. డిగ్రీ కోర్సుల్లో ప్రధానమైన బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్(బీబీఎం) కోర్సులకు సంబంధించి కొన్ని కళాశాలలకు ఇంకా అనుమతులు రాలేదు. బీసీఏ, బీబీఎం కోర్సులకు గత ఏడాది వరకు ఆయా యూనివర్శిటీల అనుమతులతో ఏపీ ఉన్నత విద్యామండలి కోర్సులకు అనుమతి మంజూరు చేసేది. అయితే ఈ ఏడాది నుంచి బీసీఏ, బీబీఎం కోర్సులకు ఏఐసీటీఈ(ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. కళాశాలల్లో వసతులు, తదితర ప్రమాణాలు పరిశీలించి కొన్ని కళాశాలలకు అనుమతులు మంజూరు చేయగా, కొన్ని కాలేజీలకు అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పాటు ఇంటర్ విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి రెండు రోజుల క్రితమే సీట్ల కేటాయింపు జరిగింది. ఇంజనీరింగ్‌లో సీటు దక్కని వారు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు వీలుగా అడ్మిషన్ల షెడ్యూల్ గడువును పొడిగించాలని విద్యార్థులు కోరగా ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 19 : ఒంగోలు నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను వైద్యఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు తనిఖీ చేశారు. శుక్రవారం నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ సెంటర్లను నిర్వాహకులు పీసీపీఎన్ పీడీ చట్టం నిబధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రిసెప్షన్, స్కార్ రూము వద్ద ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకొని యాజమాన్యాలు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప మాస్‌మీడియా అధికారి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు శుభాకాంక్షలు


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో డ్వాక్రా వీవోఏలు

నాగులుప్పలపాడు, జూలై 19 : ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను డ్వాక్రా వీవోఏలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో మండల పరిధిలో వీవోఏలు విజయ్‌కుమార్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, జూలై 19: మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం ఏడుగుండ్లపాడు సమీపంలో జరిగింది. మోటార్‌సైకిల్‌కు ఒక్కసారిగా లారీ అడ్డురావడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఆర్.పవన్‌కుమార్, ఎల్.సందీప్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

పోలీసు సిబ్బంది జవాబుదారీగా ఉండాలి

- ఎస్పీ దామోదర్
- నగరంలోని పోలీస్ స్టేషన్ల పరిశీలన


ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), జూలై19: పోలీసు సిబ్బంది జవాబుదారీతో మెలగాలని, ఫిర్యాదిదారులతో మర్యాదగా వ్యవహరించి పారదర్శకంగా పని చేయాలని ఎస్పీ దామోదర్ సూచించారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్, మహిళ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పనిచేసి శాఖ ప్రతిష్టను పెంచాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేరాలు జరగకుండా పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎస్పీ కోరారు. నగరంలో బైక్‌లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న సైలెన్సర్లను కట్టడి చేసి వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. మహిళ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరు మెరుగుపడాలని పేర్కొన్నారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కాగా ఆయా స్టేషన్ల వద్ద ఉన్న ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్పీ సీఐ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ సీఐ మాలకొండయ్య, టూటౌన్ సీఐ జగదీష్ ఉన్నారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి జర్నలిస్టు సంఘాల ఫిర్యాదు


ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ఒంగోలు(కల్చరల్), జూలై 19: ఇటీవల విశాఖపట్నంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే), ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఒంగోలులో ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీకి వారు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ. రమణ, డి.కనకయ్యలు మాట్లాడుతూ విధి నిర్వహణలో జర్నలిస్టులకు పోలీసుశాఖ సహకరించేలా చూడాలని కోరారు. జిల్లాలో శాంతిభద్రతలను మెరుగుపరిచేందుకు తమవంతు సహకారాన్ని అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ మీడియాతో పోలీసుశాఖ స్నేహపూర్వకంగా ఉంటుందని, కలిసిమెలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్): మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏపీడబ్ల్యూజేఎస్, ఏపీజేఏఫ్, ఏపీఈజేయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారికి ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ విజయసాయిరెడ్డిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సతీష్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ సంఘీభావం తెలిపారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు, అసభ్యపదజాలంతో జర్నలిస్టులపై మాట్లాడటాన్ని ఖండించారు. తనపై వచ్చిన ఆరోపణలను పక్కన పెట్టి జర్నలిస్టులపై చిందులు వేయడం ఏమిటని ప్రశ్నించారు. జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

డంపింగ్ యార్డు కోసం స్థల పరిశీలన

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు


ముక్కోడిపాలెం వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

కొండపి, జూలై 19 : మండల కేంద్రమైన కొండపిలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. జాళ్లపాలెం రోడ్డులో పీడబ్ల్యూడీ చెరువు ఒడ్డున వేస్తున్న వ్యర్థాల కారణంగా అటువైపు రాకపోకలు సాగించే పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా ఉందని గురువారం కొండపి వచ్చిన కలెక్టర్‌కు పెదకండ్లగుంట వాసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె తక్షణమే డంపింగ్ యార్డుకు స్థలాన్ని చూడాలని, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్, ఎంపీడీవో నాగమణిని ఆదేశించారు. దీంతో తహసీల్దార్, ఎంపీడీవో శుక్రవారం ఉదయం కొండపిలో వ్యర్థాలు వేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం జాళ్లపాలెం రోడ్డులో గతంలో గుర్తించిన ప్రాంతాన్ని, ముక్కోడిపాలెం వద్ద గతంలో డంపింగ్ యార్డుకు కేటాయించి షెడ్డులు నిర్మించిన ప్రదేశాన్ని చూశారు. ముక్కోడిపాలెం వద్ద ఆక్రమణలకు గురైన చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ పొరుగున ఉన్న రైతుతో మాట్లాడారు. మీకు హక్కు ఉన్నది పోను మిగిలిన ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలని, సర్వేయర్‌తో కొలిపించి హద్దుల్లో రాళ్లు వేస్తామని చెప్పారు.

డెంగ్యూ బాధితుడికి డీఎంహెచ్‌వో పరామర్శ


స్థానికులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో సురేష్‌బాబు

సంతనూతలపాడు, జూలై 19: సంతనూతలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న బాధితుడిని శుక్రవారం డీఎంహెచ్‌వో డి.సురేష్‌బాబు, డీఎంవో మాధవీలత పరామర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కాలనీలో దోమలు వృద్ధి చెందకుండా స్ప్రే, బ్లీచింగ్ చల్లించారు. ప్రజలు దోమతెరలు వాడాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. అంగనవాడీ కేంద్రాల్లో ఆరోగ్యపరీక్షలు చేయించారు. కార్యక్రమంలో లెప్రసీ అధికారి డి.శ్రీవాణి, వైద్యురాలు పి.హరిణి, తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..


పీఎంశ్రీ స్కూళ్ల నోడల్ అధికారిగా ఎంఈవో-2

ఒంగోలు(విద్య), జూలై 19 : పీఎంశ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం అమలు జరుగుతున్న పాఠశాలలకు మండల స్థాయిలో ఎంఈవో-2ను నోడల్ అధికారిగా నియమించారు. ఇటీవల జరిగిన సమగ్ర శిక్ష పీఏబీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. దీంతో ఎంఈవో-2లను పీఎంశ్రీ పాఠశాలలకు నోడల్ అధికారిగా నియమిస్తూ సమగ్ర శిక్ష సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా పాఠశాలలో నిర్వహించే కార్యకలాపాలను మండల స్థాయిలో వీరు పర్యవేక్షిస్తారు. వారానికి ఒకసారి తప్పనిసరిగా సందర్శించి పని నాణ్యత, మౌలిక వసతులను పరిశీలిస్తారు. పరిశుభ్రమైన తాగునీరు, టాయిలెట్లు, చేతులు శుభ్రం చేసుకొనే వసతి, బాలికల టాయిలెట్లు, శానటరీ ప్యాడ్ల వెండింగ్ మిషన్లు, ఇన్సినెరేటర్లు ఏర్పాటు చేయాలి. అన్ని రకాల వసతులు పీఎంశ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

31 వరకు ఇంటర్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), జూలై 19 : అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫేజ్-2 ప్రవేశాలు ప్రకటించిన తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

22న నిరసన కార్యక్రమాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 19: గత రెండు నెలలుగా ఉపాధి కూలీలు చేసిన పనులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఈనెల 22వ తేదీన చేపట్టిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని, ఈనెల 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉపాధికి నిధులుపెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జాలా అంజయ్య, జిల్లా అధ్యక్షుడు నురుసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న రఘురామ్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 19: జిల్లాలోని గ్రామ గ్రామాన సంఘాన్ని నిర్మించడంతో పాటు దళితుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు జువ్వాజిరాజు ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారం పట్ల పాలకవర్గాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దళితుల సమస్యలపై సంఘం ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు. అంతకు ముందు జిల్లా కమిటీ సభ్యుడు గద్దె జడ్సన్, కడప జిల్లాకార్యదర్శి సునీల్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, అట్లూరి రాఘవులు, వి.మోజేష్, కాలే మల్లికార్జునరావు, బక్క జేసురత్నం, పి.రాజశేఖర్, కె.బ్రహ్మయ్య, కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(విద్య), జూలై 19: జిల్లా అండర్-11 బాల, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక కోసం ఈనెల 21న ఒంగోలులోని ఐకాన్ గ్లోబల్ స్కూలులో చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ ఖాదర్‌బీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని ఈనెల 27, 28తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. పోటీలు బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2013 ఫిబ్రవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులు. ఆసక్తిగల క్రీడాకారులు 9666725719 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిన వైసీపీ మహిళా నేత


పురందేశ్వరితో రమాదేవి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 19: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఒంగోలుకు చెందిన వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి జిల్లెళ్ళమూడి రమాదేవి ఆ పార్టీలో చేరారు. శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పురందేశ్వరి ఆమెకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వెన్నంటే ఉండే రమాదేవి వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పనిచేయడంతో పాటు ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్‌గా పనిచేశారు. రానున్న రోజుల్లో బీజేపీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

క్విస్ ఫార్మసీలో అవగాహన సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 19: ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం స్త్రీ ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కిమ్స్ వైద్యశాల గైనకాలజీ వైద్యనిపుణులు గుంజుపల్లి కల్పన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు వైద్యసేవలు పొందాలన్నారు. గర్భాశయం, అండకోశాలు తదితర భాగాలకు సంబంధించిన రుగ్మతలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ ఎం.కిషోర్‌బాబు, కిమ్స్ మేనేజర్ అమరనాథ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ధనమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సేవలో శిద్దా


చెక్కును అందిస్తున్న శిద్దా రాఘవరావు, కుటుంబసభ్యులు

ఒంగోలు(కల్చరల్), జూలై 19: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తన కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం శబరిమల సన్నిధానంలో అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఆయన సతీమణి లక్ష్మీపద్మావతి, కుమారుడు సుధీర్‌కుమార్‌లతో శుక్రవారం ఉదయం స్వామి వారి అభిషేక సేవల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రావెంకోర్ దేవస్థాన అధికారులు శిద్దా కుటుంబసభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సన్నిధానంలో స్వాములకు దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శిద్దా రాఘవరావు రూ.4లక్షల విరాళం అందజేశారు.

సెక్టోరల్ పోస్టుల అర్హుల జాబితా 23న

ఒంగోలు(విద్య) జూలై 19: సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్ అసిస్టెంట్ సెక్టోరల్ అధికారుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల జాబితాను ఈనెల 23న ప్రకటించనున్నట్లు డీఈవో సుభద్ర శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న సీఎంవో, ఐఈసీవో, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్, ఏఎస్‌వో పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఈ నాలుగు పోస్టులకు 58 దరఖాస్తులురాగా పీఎంవో పోస్టుకు 19, ఐఈకో ఆర్డినేటర్ పోస్టుకు 11, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ పోస్టుకు 17, ఏఎస్‌వో పోస్టుకు 11 దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిశీలన ఈనెల 23న ముగుస్తుంది. అదేరోజు అర్హత జాబితాను ప్రకటిస్తామని డీఈవో వెల్లడించారు.

23 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మద్దిపాడు,జూలై 19: మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఏడుగుండ్లపాడు, 24న ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, 25న గుండ్లాపల్లి, అన్నంగి, 26న పెద్దకొత్తపల్లి, నేలటూరు, 27న దొడ్డవరం, మల్లవరం గ్రామాలలో డిజిటల్ అసిస్టెంట్ తేళ్ల కుమారి ఆధ్వర్యంలో ఆధార్‌కార్డుల్లో తప్పులు ప్రజలు సరిచేయించుకోవాలన్నారు.

ఓ మోస్తరు వర్షం

కొండపి, జూలై 19 : కొండపి ప్రాంతంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జల్లులు పడుతూనే ఉన్నాయి. వర్షాలకు పొలాల్లో పచ్చిక పచ్చబడింది. పొలాల్లో పైర్ల సాగుకు ఇబ్బంది లేకుండా రైతులు గడ్డి, కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ఎర్ర నేలల్లో రైతులు కంది విత్తడం ప్రారంభించారు.

దొడ్డవరం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మద్దిపాడు,జూలై 19: మద్దిపాడు మండలం దొడ్డవరం సర్పంచ్ పూనూరి సుబ్బారావు చెక్‌పవర్‌ను రద్దుచేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి శుక్రవారం తెలిపారు. నీటి పన్నుల వసూళ్లలో అవినీతి చోటు చేసుకుందన్న ఆరోపణలతో చెక్‌పవర్ రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. ఇకపై పంచాయతీలో చేపట్టే లావాదేవీల్లో ఈవోఆర్డీ అనుమతి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

నిలిచిన కేవీపాలెం తాగునీటి పథకం

పక్షంరోజులుగా ఆగిన నీటి సరఫరా

చీమకుర్తి దక్షిణం ప్రాంత ప్రజల అవస్థలు ● పట్టించుకోని యంత్రాంగం

చీమకుర్తి, జూలై19 : గత పక్షంరోజులకు పైగా తాగునీరు సరఫరా నిలిచిపోయి మండలంలోని దక్షిణం బెల్ట్‌లో ఉన్న దాదాపు పదిహేను గ్రామాలకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. మోటార్లు కాలిపోయి మరమ్మతులకు నోచుకోక నీటి సరఫరా నిలిచిపోయినా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవటం గమనార్హం. రామతీర్థం జలాశయం నుంచి పైపులైన్ ద్వారా చీమకుర్తి మండలంలోని దక్షిణం వైపున్న గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు కేవీ.పాలెం తాగునీటిపథకం ఏర్పాటు చేశారు. ఈ పథకానికి సంబంధించిన పంపుహౌస్, సంపు తదితరాలన్నీ దేవరపాలెం పంచాయతీపరిధిలో ఉన్న ఊబచెత్తపాలెం వద్ద ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న మోటార్లు తరచూ మొరాయిస్తూ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈసారి ఏకంగా నీటి సరఫరా నిలిచిపోయి పక్షంరోజులకు పైగా అవుతున్నా బాగోగులను పట్టించుకొనే నాధుడే కరవయ్యారు. శుక్రవారం జలాశయం తనిఖీకి వచ్చిన కలెక్టర్ దృష్టికి కూడా ఈ విషయాన్ని అధికారులు తీసుకోకపోవటం గమనార్హం. తక్షణమే ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టిసారించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దేవరపాలెం వద్ద ఉన్న తాగునీటిపథకం

అంగన్వాడీ కార్యకర్తపై ఫిర్యాదు.. విచారణ

పీసీపల్లి, జూలై 19 : గత వైసీపీ ప్రభుత్వంలో నియమించిన అంగన్వాడీ కార్యకర్త స్థానికురాలు కాదని ఆరోపిస్తూ కొంతమంది గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు కనిగిరి ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని శుక్రవారం విచారణ జరిపారు. సీడీపీవో తెలిపిన వివరాల మేరకు... కోదండరామపురం మినీ అంగన్వాడీ కార్యకర్తగా గుర్రం ఐశ్వర్యను నియమిస్తూ ఈ ఏడాది మార్చి 12న (ఎన్నికలకు 2నెలల ముందు) ఉత్తర్వులు ఇచ్చారు. ఆమెపై వచ్చిన ఫిర్యాదు మేరకు సీడీపీవో శుక్రవారం కోదండరామపురం వెళ్లి విచారణ జరిపారు. కార్యకర్త వద్ద ఉన్న స్థానికత ఆధారాలను పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అంగన్వాడీ కేంద్రం వద్దకు వెళ్లి కార్యకర్త స్థానికురాలు కాదని, ఈమె కార్యకర్తగా ఉన్నంత కాలం పిల్లలను కేంద్రానికి కూ డా పంపబోమని సీడీపీవోకు చెప్పారు. ఆమె స్థానికురాలో కాదో విచారించి తమకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరినట్లు సీడీపీవో ఆంధ్రజ్యోతికి తెలిపారు.

స్వల్పంగా కంపించిన భూమి

పీసీపల్లి, జూలై 19 : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. గుదేవారిపాలెం, మారెళ్ల, పెదఅలవలపాడు, రామాపురం గ్రామాల్లో భూమి కంపించింది. ఉదయం 8గంటల సమయంలో రెండు సెకన్ల పాటు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇళ్లల్లో అటకలపై ఉన్న వస్తువులు కదిలాడాయి. ఈ ప్రకంపనలతో ఉలిక్కిపడ్డ ప్రజలు ఒక్కసారిగా ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

వెలిగండ్ల, జూలై 19 : గత ప్రభుత్వంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించిన ఇద్దరు స్వచ్ఛందంగా వైదొలిగారు. మండలంలోని మోటుపల్లి, మరపగుంట్ల పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ మేరకు ఎంపీడీవోకు రాజీనామ పత్రాలు అందజేశారు. మరికొందరు రాజీనామా చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో అంటకాగి ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన ఎఫ్ఏలు ప్రభుత్వం మారడంతో తమకు ఇబ్బందులు ఏర్పడతాయన్న భయంతో రాజీనామాలు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా గ్రా మా ల్లో అధికార పార్టీ కూటమి నేతలు తమపై విచారణ చేయిస్తే ఇబ్బందులు తప్పవన్న భయంతో వారు రాజీనామాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఉపాధి పనుల్లో అవినీతి వాస్తవమే..

● డ్వామా పీడీ అర్జునరావు

కురిచేడు, జూలై 19 : మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి వాస్తవమే అని, అందుకు సంబంధించి సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టరుకు సిఫార్సు చేసినట్లు డ్వామా పీడీ అర్జునరావు చెప్పారు. మండలంలో ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై సామాజిక తనిఖీ బృందం బుధవారం రోజున ప్రజావేదిక నిర్వహించారు. ఈ వేదిక సాక్షిగా విచారణ బృందం రూ.10 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు తేల్చారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో ఉపాధి పనుల్లో అవినీతి శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా డ్వామా పీడీ అర్జున రావు వివరణ ఇచ్చారు. మొత్తం ఉపాధి పనుల్లో అవతవకలు జరిగిన మొత్తం రూ.34.22 లక్షలు అని, అందులో రూ.11.48 లక్షల అవినీతికి సంబంధించి సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు జిల్లా కలెక్టరుకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన దుండగుడు

రామకృష్ణాపురం(చీరాలటౌన్), జూలై 19 : పట్టపగలే మహిళ ఒంటరిగా వెళుతుండగా గమనించిన ఓ దుండగుడు ఆమె మెడలో చైన్‌ను లాక్కెళ్లేందుకు యత్నించాడు. ఈఘటన శుక్రవారం చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల హేమసాయిలత స్వగ్రామం చీరాలలోని రామకృష్ణాపురం. అయితే తిరునాళ్లు ఉండటంతో మొక్కుబడులు చెల్లించేందుకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈక్రమంలో ఉదయం సుమారు 10 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఈమెను చూసి కిందకు దిగాడు. దర్జాగా ఒంటరిగా ఉన్న మహిళపై తెగబడి మెడలోని చైన్, నల్లపూసల బంగారు గొలుసులు అపహరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె కూడా ఎదురు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో పెనుగులాటలో చైన్ తెగింది. సుమారు 10 గ్రాముల వరకు బంగారం అపహరించి దుండగుడు పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సీసీ కెమెరా ఆధారంగా గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అపహరణకు పాల్పడిన వ్యక్తి ఎరుపు రంగు టోపీ, నలుపు రంగు ఫ్యాంటు, పచ్చ రంగు టీషర్ట్ ధరించి ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు.



మహిళ మెడలో చైన్ స్నాచింగ్‌కు తెగబడుతున్న దుండగుడు

డోన్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

గిద్దలూరు, జూలై 19 : రైల్వేడబ్లింగ్ పనుల కారణంగా చాలాకాలంగా రద్దయిన డోన్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పునరుద్ధరించారు. ఈ నెల 21 నుంచి గుంటూరు-గిద్దలూరు-డోన్ (17227) ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 22 నుంచి డోన్-గిద్దలూరు-గుంటూరు (17228) ఎక్స్‌ప్రెస్ యథావిధిగా గతంలో తిరిగే సమయాల్లోనే పగటిపూట తిరుగుతుందని రైల్వేఅధికారులు ప్రకటించారు. ఇదిలా వుండగా హుబ్లీ-గిద్దలూరు-విజయవాడ మధ్య తిరిగే ఎక్స్‌ప్రెస్‌ను, కొవిడ్ సమయంలో రద్దయిన విజయవాడ- గిద్దలూరు- యశ్వంత్‌పూర్ ప్యాసింజర్ రైలును కూడా పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేశ కుటుంబవ్యవస్థ ప్రపంచానికి ఆదర్శనీయం

గిద్దలూరు, జూలై 19 : భారతదేశ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమని శివసేవక్ మహాత్మ వైష్ణోం దాస్ శివకరన్ అన్నారు. మహారాష్ట్రలోని కరోని గ్రామం నుంచి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేస్తున్న పాదయాత్రలో భాగంగా శివకరన్ శుక్రవారం గిద్దలూరు చేరుకున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి ఆయన స్వాగతం పలికారు. 2022 మార్చి 25న కరోని నుంచి పాదయాత్ర మొదలు పెట్టినట్లు పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. వ్యసనాలకు అలవాటు పడ్డ యువతకు విముక్తి కల్పించి దేశప్రయోజనాల కోసం వారిని తయారు చేసేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు.



పాదయాత్ర చేస్తున్న శివశంకరన్

ఉసురుతీసిన ఈత సరదా

వల్లూరులో చెరువులోకి దిగి యువకుడు మృతి ● సెల్‌సిగ్నల్స్ ఆధారంగా గుర్తింపు ● మరొకరు గల్లంతు

టంగుటూరు, జూలై 19 : ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన వల్లూరు చెరువులో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని వాసేపల్లిపాడుకు చెందిన నల్లమలపు నవీన్ (23), బానల వెంకటేష్ అలియాస్ శ్యామ్ (22) మిత్రులు. వీరిద్దరూ గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయటికివచ్చారు. రాత్రికి కూడా ఇంటికి చేరుకోలేదు. దీంతో వారి బంధువులు రాత్రంతా ఎదురు చూశారు. శుక్రవారం మధ్యాహ్నం వారు టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారి సెల్‌ఫోన్ నెంబర్‌లను తీసుకుని లోకేషన్‌ను గుర్తించారు. అది వల్లూరు చెరువు అని చూపించింది. సీఐ రంగనాథ్, ఎస్సై పున్నారావుతో కలసి ఆ యువకుల బంధువులు వల్లూరు చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువులోని ఒక కుంట ఒడ్డున వారి దుస్తులు, చెప్పులు ఉండడాన్ని గుర్తించారు. దీంతో పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కుంటలోకిదిగి గాలింపు చేపట్టారు. సాయంత్రానికి నవీన్ మృతదేహం కనిపించడంతో బయటకు చేర్చారు. శ్యాంబాబు అచూకీ లభించలేదు. చెరువులోని కుంట గట్టున దొరికిన ఆధారాలను బట్టి శ్యాంబాబు కూడా చెరువులోకి దిగి ఉంటాడన్న నిర్ధారణకు పోలీసులు వచ్చారు. చీకటిపడడంతో చెరువులో వెతకడం ఆపివేశారు. శనివారం గజ ఈతగాళ్లను రంగంలోకి దింపాలని నిర్ణయించుకున్నారు. నవీన్‌కు తల్లిదండ్రులు లేరు. ఆయన గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్యాంబాబుకు కూడా తల్లిదండ్రులు లేరు. నానమ్మ వద్ద ఉంటున్నాడు. ఈతకోసం కుంటలోకి దిగి వీరి మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.



నవీన్ మృతదేహం, పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్, ఎస్సై పున్నారావు

రామతీర్థం జలాశయాన్ని సందర్శించిన కలెక్టర్



జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

చీమకుర్తి, జూలై 19 : రామతీర్థం జలాశయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌టేక్ వెల్, పంపుహౌస్‌ను పరిశీలించారు. జలాశయంలో నీటి లభ్యత, నీటి సరఫరా తదితర అంశాలను ఇరిగేషన్‌శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అడుగంటిన జలాశయానికి సాగర్‌జలాలు సోమవారం సాయంత్రానికి చేరుకుంటాయని వారు చెప్పారు. జలాశయం గురించి సవివరంగా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్‌అలీ, ఇరిగేషన్ ఎస్‌ఈ మురళీకృష్ణ, ప్రాజెక్ట్ ఎస్‌ఈ అబుత్‌అలీం, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చీమకుర్తి గురుకులంలో ఆకస్మిక తనిఖీ

చీమకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యాలయాన్ని కలెక్టర్ అన్సారియా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల అడ్మిషన్ల వివరాలు, హాజరును పరిశీలించారు. వంట సరకులు, నాణ్యత, భోజనం రుచి, కిచెన్‌లో పరిశుభ్రత, వండిన ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. మెనూను చెక్ చేశారు. తదుపరి విద్యార్థినులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, కిట్లు, యూనిఫాం అందాయా లేదా అని ప్రశ్నించారు. నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహార భోజనాన్ని విద్యార్థులకు అందించటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సురేష్, కమిషనర్ ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

పోతుల వెస్ట్‌కాలనీవాసుల వెతలు

● కనీస సౌకర్యాలు కరువు

● కనిపించని రోడ్లు, కాలువలు

టంగుటూరు, జూలై 19 : టంగుటూరు పంచాయతీ పరిధిలోని పోతులవెస్ట్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకుపడితే కాలుతీసి కాలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. 2009లో స్థానిక మండల కార్యాలయాల పక్కన ఉన్న 49.53 ఎకరాల దేవదాయ భూమిలో ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్ వేసింది. అందులో 1,258 మందికి నివేశన స్థలాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. తొలి విడత 1,150 మందికి, రెండో విడతలో మరో 100 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు.

రోడ్లు, సైడు కాలువలు లేవు

కాలనీలో మొత్తం సుమారు 25 వీధులున్నాయి. వీటిలో నగం వీధుల్లోనే గ్రావెల్ పరిచారు. కేవలం రెండు సిమెంట్ రోడ్లు ఉన్నాయి. సగానికి పైగా వీధుల్లో కనీసం గ్రావెల్ రోడ్లు కూడా లేవు. రోడ్లే లేనప్పుడు సైడు కాలువల నిర్మాణం జరిగేది ఎలా? అందుకే కాలువలు అన్న మాటే లేదు.

చినుకుపడితే కాలనీ అంతా చిత్తడే

చినుకు పడితే కాలనీ అంతా చిత్తడిగా మారుతోంది. భారీ వర్షం కురిస్తే ఇళ్ల నుంచి వీధుల్లోకి వచ్చే అవకాశం కూడా ఉండటం లేదు. మోకాలు లోతున నీరు నిలిచి పరిస్థితి దయనీయంగా ఉంటోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించ కాలనీలో సిమెంటు రోడ్లు, సైడు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కాలనీలో ఇళ్ల మధ్య రోడ్డు దుస్థితి

వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శుల కొరత

తాళ్లూరు మండలంలో ఎనిమిది గ్రామాలకు రెగ్యులర్ కార్యదర్శులు లేరు ● ఐదోచోట్ల ఒకరే ఇన్‌చార్జి బాధ్యతలు

పాలన సాఫీగా సాగక ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● వర్షాకాలం కావడంతో క్షీణిస్తున్న పారిశుధ్యం

తాళ్లూరు, జూలై 19: తాళ్లూరు మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేక పాలన కుంటుపడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 14 గ్రామసచివాలయాలు ఉండగా 7 చోట్ల పంచాయతీ కార్యదర్శులు లేరు. మేజర్ పంచాయతీ తూర్పు గంగవరం పంచాయతీ కార్యదర్శి 4గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. లక్కవరం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి ఆవుల సుజాత లంచం తీసుకుంటూ రెండేళ్ల క్రితం ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆమెను సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో ఇన్‌చార్జిని నియమించారు. గత ఏడాది జరిగిన సాధారణ బదిలీలలో శివరాంపురం, వితలాపురం, రామభద్రాపురం గ్రామాల కార్యదర్శులు బదిలీపై వెళ్లగా వారి స్థానే ఎవరూ నియమించలేదు. దీంతో ఆ గ్రామపంచాయతీలకు ఇన్‌చార్జులను నియమించారు. మల్కాపురం పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ వితలాపురం, లక్కవరం గ్రామపంచాయతీలకు ఇన్‌చార్జిగా ఉన్నారు. లక్కవరం గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు మల్కాపురం పంచాయతీ కార్యదర్శిని డీపీవో 5నెలల క్రితం సస్పెండ్ చేశారు. దీంతో మల్కాపురం, వితలాపురం, లక్కవరం పంచాయతీలకు కార్యదర్శుల కొరత ఏర్పడింది. నాగంబొట్లపాలెం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి పురం నరేంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన స్థానే ఎవరినీ నియమించలేదు.

ఒక్కరే ఐదు గ్రామాలకు...

తూర్పుగంగవరం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి టి.అజయ్‌కీర్తి వితలాపురం, నాగంబొట్లపాలెం, రామభద్రాపురం, లక్కవరం పంచాయతీలకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. 5 గ్రామపంచాయతీలు ఉండటంతో అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించటం కష్టతరంగా ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వీధులన్నీ రోతగా తయారయ్యాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పంచాయతీ కార్యదర్శి కోసం సచివాలయాల వద్దకు వెళితే అందుబాటులో ఉంటే అవకాశం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాధవరం పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు మల్కాపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్నారు. శివరాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పక్కమండలమైన ముండ్లమూరు నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. తురకపాలెం, దోసకాయలపాడు పంచాయతీలకు కార్యదర్శులు లేరు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లగా వైసీపీ పాలకులు రెగ్యులర్ కార్యదర్శులను నియమించటంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి రాగానే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శుల నియామకాలు జరుగుతాయని ప్రజలు ఎదురు చూడగా వారి ఆశలు అడియాశలయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చినెల దాటినా పంచాయతీ కార్యదర్శుల నియామకం జరగలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఖాళీగా ఉన్న స్థానాల్లో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులను నియమించి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తూర్పుగంగవరం గ్రామసచివాలయం

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

నిందితుడు చీరాల మండలం వాడరేవువాసి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 19: అతడు వ్యసనాలకు బానిసయ్యాడు.. ఈజీగా డబ్బు ఎలా సంపాదించాలని ఆలోచిస్తూ యూట్యూబ్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లను పరిశీలించాడు. ఈ క్రమంలో రైళ్లలో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కొంతకాలంగా రైళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులు గళ్లు గప్పి తిరుగుతుండగా నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ విజయభాస్కర్ నిందితుడి వివరాలను శుక్రవారం వెల్లడించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన పెదాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకి అలియాస్ వెంకటేష్ కూలి చేసుకుంటూ జీవించేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసయ్యాడు. సంపాదించిన డబ్బు తన అవసరాలకే సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలన్ని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్, ఇన్‌స్ట్రాగ్రామ్‌ల్లో రైళ్లలో దొంగతనాలు చేసే రీల్స్‌ను చూసి దొంగగా మారాడు. రైళ్లలో తిరుగుతూ ప్రయాణికులు ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌లు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను దొంగలించి వాటిని అమ్ముకొని వచ్చిన సొమ్ముతో జల్సాగా జీవించేవాడు. ఇటీవల చీరాలలో రైలు దొంగతనాలు అధికం కావడంతో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే ఎస్ఐ సీహెచ్ కొండయ్య తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారంగా నిందితుడు వెంకటేశ్వర్లును గుర్తించారు. అతడి కదలికలపై నిఘా ఉంచి గురువారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. పలు రైళ్లలో నేరాలకు పాల్పడినప్పుడు నిందితుడు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి రూ.3.81 లక్షల విలువ చేసే 62 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్, మూడు వాచ్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించిన చీరాల రైల్వే ఎస్ఐ సీహెచ్ కొండయ్య, సిబ్బంది కే భాస్కర్, గోపి, లక్ష్మీనారాయణ, శ్రీనురాజు, బ్రహ్మయ్యలను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఒంగోలు ఇన్‌చార్జి సీఐ కె భుజంగరావు, నెల్లూరు, చీరాల ఎస్ఐలు మాలకొండయ్య, సీహెచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ విజయభాస్కర్

తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వం అనుమతి

● రెండు, మూడు రోజుల్లో సీసీఎల్ఏ నుంచి ఉత్తర్వులు జారీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 19: సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను తమ జిల్లాలకు పంపుతూ ప్రభుత్వం అనుమతిస్తూ సీసీఎల్ఏకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో జిల్లా నుంచి 50మంది తహసీల్దార్లు నెల్లూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు తహసీల్దార్లను బదిలీ చేయగా ఇరువురు తహసీల్దార్లు కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల ముగిసి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈనేపథ్యంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వచ్చిన తహసీల్దార్లను వారి జిల్లాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ప్రభుత్వం శుక్రవారం తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేసేందుకు అనుమతిని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెండు, మూడు రోజుల్లో తహసీల్దార్లను వారి జిల్లాలకు బదిలీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. తహసీల్దార్లు జిల్లాకు వచ్చి జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత మండలాలను కేటాయించనున్నారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలన



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

సంతనూతలపాడు, జూలై 19: సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌ను బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పరిశీలించారు. 13 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఉండటంతో వారిని పరామర్శించారు. అన్ని సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయించాలని డీఎంహెచ్‌వో డి.సురేష్‌బాబుకు ఫోన్ ద్వారా తెలిపారు. వసతిగృహాల్లో మెనూను కచ్చితంగా పాటించాలని, స్కూల్లో డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానంగా ఉందని, సక్రమంగా ఉండేటట్లు చూడాలని ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దార్ మీరావలిలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌ను సరిచేయించిన టీడీపీ నాయకులు

జమ్ములపాలెం (టంగుటూరు), జూలై 19 : మండలంలోని జమ్ములపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో కిందకు జారి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్‌ను టీడీపీ నాయకులు సరిచేయించారు. ఊరికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ పాఠశాల ఆవరణలో ఉంది. అక్కడ తీగలు కిందకు జారాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు స్థానిక టీడీపీ నేత మక్కెన వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ ఏఈ చంద్రశేఖర్‌తో చర్చించారు. వెంటనే ఆయన లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును పాఠశాల వద్దకు పంపారు. లైన్ సరిచేసేందుకు కొన్ని పరికరాలు అవసరం కావడంతో వెంకట్రావు సొంత నిధులతో వాటిని తెప్పించారు. లైన్‌ఇన్‌స్పెక్టర్ కిందకు జారిన తీగలను సరిచేశారు. అనంతరం వెంకట్రావు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు హరీష్, రమేష్ ఉన్నారు.



విద్యుత్ లైన్ సరిచేస్తున్న ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

● విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో చర్యలు

కంభం(అర్ధవీడు), జూలై 19 : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోగోలు జడ్పీ హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగేశ్వరరావు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో వారు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్, డీఈవో సుభద్రను విచారణ అధికారిగా పంపించారు. పది రోజుల క్రితం పాఠశాలకు వచ్చి విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక పంపించారు. దీంతో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు డీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని డిప్యూటీ డీఈవో తెలిపారు.

ఆర్టీసీ బస్సు- మినీ వ్యాన్ ఢీ

● వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్ద దోర్నాల, జులై 19: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, టెంపో వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన శ్రీశైలం ఘాట్ రోడ్డులో చట్టుతాండా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన జీ.జ్ఞానేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై అంకమరావు తెలిపిన కథనం ప్రకారం విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళుతోంది. ఇదే సమయంలో శ్రీశైలం దైవదర్శనానంతరం తిరిగి వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన టెంపో వాహనం చట్టుతాండ మూలమలుపు వద్ద వేగం అదుపు తప్పి బస్సును ఢీ కొట్టింది. దీంతో టెంపో వాహనం ముందు భాగం దెబ్బతింది. ఆ కుదుపునకు టెంపో డ్రైవర్ జ్ఞానేశ్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న కొందరు యాత్రికులు 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

● పట్టించుకోని అధికారులు



ప్రమాదభరితంగా ఉన్న స్తంభం

బేస్తవారపేట, జూలై 19 : బేస్తవారపేట మండలంలోని ఖాజీపురం గ్రామ సమీపంలో 11 కేవి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు పెచ్చులూడి ఇనుపరాడ్ల వెంట విద్యుత్ సరఫరా అవుతోందని, పలువురు తెలిపారు. చిన్నపాటి వర్షం పడిన స్థంభాలకు విద్యుత్ సరఫరా జరిగి పలుమార్లు గేదెలు మృతిచెందిన ఘటనలు ఉన్నాయని అన్నారు. ఖాజీపురం గ్రామం నుంచి చెరువు కట్టపై ఉన్న పొలాల్లో అధ్వాన స్థితిలో స్తంభాలు ఉన్నాయని వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగితీగ చోరీ



దొంగలు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

త్రిపురాంతకం, జూలై 19: మండలంలోని లేళ్లపల్లిలో పొలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు. అందులోని రాగితీగను చోరీ చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు చింతల యోగిరెడ్డి, గంపల సుధాకర్ తమ వ్యవసాయ పొలాలలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కాగా యోగిరెడ్డి శుక్రవారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తొలగించి, ధ్వంసం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. అందులోని రాగతీగను చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో సుమారు రెండు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఘటనపై విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు, జూలై 19 : గౌరవప్రదమైన రాజ్యసభసభ్యునిగా ఉంటూ జర్నలిస్టులపై, మీడియా సంస్థల యాజామాన్యాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డుపై బుద్ధిని విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. రెవెన్యూ కార్యాలయం ఎదుట, పోలీసుస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐ సోమయ్యను కలిసి విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ కార్యాలయంలో సైతం వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొమరోలు, జూలై19: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక సాయిబాబా దేవాలయం సమీపంలోని రాష్ట్రీయ రహదారిపై చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు కొమరోలు మండలం కత్తులవానిపల్లి గ్రామానికి చెందిన చిన్న సుబ్బయ్య పనిపై మోటార్ సైకిల్‌పై కొమరోలుకు వచ్చి తిరిగి స్వగ్రామమైన కత్తులవానిపల్లి గ్రామానికి వెళ్తుండగా ఏదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్న సుబ్బయ్య తీవ్రగాయాలపాలైనారు. వెంటనే స్థానికులు గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. గిద్దలూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ చిన్న సుబ్బయ్య(60) మృతి చెందారు. మృతిచెందిన చిన్న సుబ్బయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని చిన్న సుబ్బయ్య కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

● విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో చర్యలు

కంభం (అర్ధవీడు), జూలై 19 : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్‌వేటు వేస్తూ, విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అర్ధవీడు మండలం బోగోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా నాగేశ్వరరావు విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో వారు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారి సుభద్రను విచారణ అధికారిగా పంపించారు. దీనిపై 10 రోజుల క్రితం బోగోలు పాఠశాలకు వచ్చి విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక పంపించారు. దీంతో నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు డీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు తెలిపారు.

గిద్దలూరు సమీపంలో రోడ్డు ప్రమాదం

● పల్నాడు జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారి గాయాలు





డాక్టర్ రంగారావు, అదుపు తప్పిన కారు

గిద్దలూరు టౌన్, జూలై 19 : డివిజన్ కేంద్రం గిద్దలూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారికి గాయాలయ్యాయి. గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ బీవీ రంగారావు పల్నాడు జిల్లా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్తగా ఉన్నాడు. గురువారం ఉదయం పల్నాడు నుండి గిద్దలూరుకు కారులో బయలుదేరాడు. గిద్దలూరుకు 7 కిలోమీటర్ల దూరంలోని రాచర్ల మండలం చెర్లోపల్లి సమీపంలో 11 గంటల సమయంలో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బి.వి.రంగారావు తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి గిద్దలూరు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. డాక్టర్ రంగారావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రంగారావును మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఆయనను పరీక్షించిన వైద్యులు ఎడమ చేయివిరగ్గా, పక్కటెముకలు కూడా కొంత విరిగినట్లు గుర్తించారు. డాక్టర్ రంగారావుకు శ్వాస తీసుకోవడంలో సమస్య ఎదురవుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం డాక్టర్ రంగారావుకు మెడికవర్ ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ రంగారావు గతంలో గిద్దలూరు, కంభం, మాచర్ల, బాపట్ల ప్రభుత్వ వైద్యశాలల్లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ప్రమాదవార్త తెలుసుకున్న వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. గిద్దలూరుకు చెందిన పలువురు శుక్రవారం కర్నూలు వెళ్ళి డాక్టర్ రంగారావును పరామర్శించారు.

డొక్కాసీతమ్మ చిత్రపటాలను ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, జూలై 19 : ప్రతి అన్నా క్యాంటీన్‌లో డొక్కా సీతమ్మ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య సూర్యవంశావలి అధ్యక్షులు సూరె నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. డొక్కా సీతమ్మ దాతృత్వం గురించి అందరికీ తెలిసిందేనని, ఆమె పేరు మీద కొన్ని అన్నదాన క్యాంటీన్లు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అయితే త్వరలో ప్రారంభించే క్యాంటిన్లలో సీతమ్మ చిత్రపటాలు ఏర్పాటు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో సూచన



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి, పక్కన ఎంపీడీవో

మార్కాపురం రూరల్, జూన్ 19: గ్రామాలలో ప్రజాసమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఎంపీపీ బండి లక్ష్మీదేవి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో చందన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండలానికి సంబంధించిన వ్యవసాయ, విద్య, ఉద్యానవన, విద్యుత్, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ వెలుగు, సచివాలయ, ఐసీడీఎస్, వైద్య సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు హాజరై ఆయా శాఖల పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. రాయవరం గ్రామంలో ఉన్న సమస్యలను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన కలగడం లేదని సమస్యలు పరిష్కారం చేయడం లేదని రాయవరం గ్రామ సర్పంచ్ కేశారపు భాగ్యలక్ష్మీ సభలో అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో సచివాలయ నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారో కచ్చితంగా తెలియజేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మోహన్‌రాజ్‌ను ప్రశ్నించారు. అలాగే గృహ నిర్మాణ శాఖ, విద్యుత్ శాఖ, ఆర్‌డీ శాఖల అధికారులను తమ గ్రామ సమస్యలను ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ మీరు సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. సభలో 2024-25ఆర్థిక సంవత్సరా నికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్ట నున్న పనులు ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయడానికి, ఈ ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేయవలసిన పనులను సభలో సభ్యులు ఆమోదించారు. సమావేశంలో పనులను సభలో సభ్యులు ఆమోదించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, అధికారులు ఎంఈవో రాందాస్ నాయక్, ఏవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ ఏపీఎం రమేష్ బాబు, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, మండలంలోని సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎల్‌డీఎం



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్

మార్కాపురం రూరల్, జూన్ 19: స్వయం సహాయక సంఘాల మహిళల స్వయం ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం ఎంపీడీవో చందన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా మండలంలో ఒక్కొక్క సభ్యురాలికి లక్ష రూపాయలు రుణం బ్యాంకులు అందిస్తాయన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ పథకాలను ఉపయోగించుకొని మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయ సంఘాల మహిళలకు 35శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లా బ్యాంకు లింకేజీ డీపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ బాలక్ రామ్, మార్కాపురం, దోర్నాల, తర్లుపాడు, పెద్దారవీడు ఏపీఎంలు రమేష్ బాబు, పోలయ్య, పిచ్చయ్య, శ్రీనివాసులపై నాలుగు మండలాల బ్యాంకుల అధికారులు, డీఆర్‌డీఏ సీసీవలు పాల్గొన్నారు.

కంభం- అర్ధవీడు రహదారికి మరమ్మతులు



గుంతలను చదును చేయిస్తున్న నాయకులు

కంభం, జూలై 19 : ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ అధికారంలోకి వచ్చి, గిద్దలూరు ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్ రెడ్డి విజయం సాధించారు. ఇటీవల సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరుకాగా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రజా ప్రతినిధులు అర్ధవీడు మండలంలో రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గుంతలు పడిన రోడ్లు చూశానని, త్వరలో మరవత్తులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అయితే మూడు రోజులు వర్షాలు కురుస్తుండడంతో అర్ధవీడు మండల రోడ్లు దారుణంగా ఉండడంతో దెబ్బతిన్న రోడ్ల మార్జిన్లు మట్టితోలించి గుంతలను పూడ్చాలని ఎమ్మెల్యే టీడీపీ నాయకులకు సూచించారు. దీంతో మండల టీడీపీ నాయకులు రంగారెడ్డి, పలువురు స్పందించారు. కంభం రైల్వే గేటు నుంచి నాగులవరం వరకు ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న బారీ గుంతలు పూడ్చారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షునికి అభినందన



శ్రీనివాసరావును సన్మానిస్తున్న బీసీ నాయకులు

మార్కాపురం, జూలై 19: మార్కాపురం పట్టణానికి చెందిన టీడీపీ బీసీ విభాగం నేతలు శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ టీడీ జనార్దన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణానికి చెందిన టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర నాయకులు దూదేకుల హుసేనయ్య పలువురు బీసీ నాయకులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలో తాము ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాయకత్వంలో సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసినట్లు తెలిపారు. వెనుకబడిన మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బీసీ విభాగం నాయకులు దూదేకుల గురవయ్య, పేరయ్య, డి.మస్తాన్, డి.ఖాశిం, అల్లూరయ్య, గంజి వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

కలెక్టరు, ఎస్పీలను కలిసిన ఎరిక్షన్‌బాబు



కలెక్టర్ అన్సారియాకు మొక్కను అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జూలై 19: నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దమోదర్‌ను వై.పాలెం నియోజకవర్గ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు కలిశారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా కలెక్టరు కార్యాలయంలో కలెక్టరును కలిసి నియోజకవర్గంలో సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో జరిగిన ఇసుక కుంభకోణం, భూ కబ్జాలు, ఎర్రగొండపాలెంలోని మిల్లంపల్లి జగనన్న కాలనీలో జరిగిన పట్టాల అక్రమాలపై విచారణ చేయించాలని కోరినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ దమోదర్‌ను కలిసి నియోజకర్గంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సమర్ధవంతమైన పోలీసులను నియమించాలని కోరినట్లు తెలిపారు.

కవులు ముందు యుగపు దూతలు

● పుస్తకావిష్కరణలో కవి దేవులపల్లి విశ్వనాథం



విశ్వనాథాన్ని సన్మానిస్తున్న ఎంఈవో

ఎర్రగొండపాలెం, జూలై 19 : సామాజిక స్పృహతో రచనలు చేసి దేశాభివృద్ధికి కవులు పాటుపడతారని ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మంజూష కవితా గ్రంథ ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఈవో పి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. విద్యార్థులు జ్ఞాన సంపన్నులై చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలన్నారు. గ్రంథ ఆవిష్కరణకర్త పూర్వపువిద్యార్థి, విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటస్వామి మాట్లాడుతూ టెక్నాలజీని అందిపుచ్చుకొని మంచిపనులకు ఉపయోగించుకోవాలన్నారు. ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు తలవంచి పుస్తక పఠనం చేస్తే సమాజంలో తలెత్తుకునే విధంగా ఎదుగుతారన్నారు. కవి దేవులపల్లి విశ్వనాథం రచించిన 32వ పుస్తకావిష్కరణలో భాగం అయినందుకు తన గురువు విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటస్వామి పుస్తకావిష్కరణ చేసినందుకు ఎంఈవో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కవి దేవులపల్లి విశ్వనాథాన్ని విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటస్వామిని ఎంఈవో ఆంజనేయులు, హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొని సన్మానించారు. ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులకు, 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు మెరిట్ విద్యార్థులకు ఒక్కోక్కరికి 1116 నగదు బహూకరించారు.

ఇంటర్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పొదిలి, జూలై 19 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం నోట్‌బుక్స్ సరఫరా చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తారావాణి మాట్లాడారు. మన కళాశాలకు ఎంతో మంచిపేరు ఉందని దాన్ని మరింత పెంచేవిధంగా మీక్రమశిక్షణ ఉండాలన్నారు. కనుక విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో ఉన్నప్పుడు తల్లి దండ్రుల ఎంతో ఆనందపడుతారన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు గౌస్, ఉపసర్పంచ్ జిలాని తదితరులు ఉన్నారు.

కొమరోలు కార్యదర్శిగా తిరుమలరెడ్డి

కొమరోలు, జూలై19: మండలంలోని కొమరోలు పంచాయతీ కార్యదర్శిగా ఎం తిరుమల రెడ్డి, చింతలపల్లి పంచాయతీ కార్యదర్శిగా టి.గణేష్‌లకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఎంపీడీవో కే.నరసింహారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని రాజుపాలెం పంచాయతీ కార్యాదర్శిగా పనిచేస్తున్న తిరుమలరెడ్డికి కొమరోలు ఇన్‌చార్జ్ కార్యాదర్శిగా, బ్రాహ్మణపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న టి గణేష్‌ను చింతలపల్లి పంచాయతీలకు పూర్తి అదనపు పంచాయతీ కార్యదర్శులుగా వీరిని నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు సెలవుపై వెళ్లడంతో పరిపాలన సౌలభ్యం కోసం వీరికి బాధ్యతలను అప్పగించామన్నారు.

ఉసురు తీసిన ఈత సరదా

- వల్లూరులో చెరువులోకి దిగి యువకుడి మృతి
- సెల్‌సిగ్నల్స్ ఆధారంగా గుర్తింపు
- మరొకరి కోసం గాలింపు



గాలింపు చేపడుతున్న సీఐ రంగనాథ్

టంగుటూరు, జూలై 19 : ఈత సరదా ఇద్దరు యువకుల ప్రాణం తీసింది. ఈ ఘటన వల్లూరు చెరువులో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని వాసేపల్లిపాడుకు చెందిన నల్లమలపు నవీన్ (23), బానల వెంకటేష్ అలియాస్ శ్యామ్ (22) మిత్రులు. వీరిద్దరూ గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై బయటకు వచ్చారు. రాత్రికి కూడా ఇంటికి చేరుకో లేదు. దీంతో వారి బంధువులు రాత్రంతా ఎదురు చూశారు. శుక్రవారం మధ్యాహ్నం వారు టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారి సెల్‌ఫోన్ నెంబర్‌లను తీసుకుని లొకేషన్‌ను గుర్తించారు. అది వల్లూరు చెరువు అని చూపించింది. సీఐ రంగనాథ్, ఎస్సై పున్నారావుతో కలసి ఆ యువకుల బంధువులు వల్లూరు చెరువు వద్దకు చేరుకున్నారు. చెరువులోని ఒక కుంట ఒడ్డున వారి దుస్తులు, చెప్పులు ఉండడాన్ని గుర్తించారు. దీంతో పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కుంటలోకిదిగి గాలింపు చేపట్టారు. సాయంత్రానికి నవీన్ మృతదేహం కనిపించడంతో బయటకు చేర్చారు. శ్యాంబాబు అచూకీ లభించలేదు. చెరువులోని కుంట గట్టున దొరికిన ఆధారాలను బట్టి శ్యాంబాబు కూడా చెరువులోకి దిగి ఉంటాడన్న అంచనాకు పోలీసులు వచ్చారు. చీకటిపడడంతో చెరువులో వెతకడం ఆపివేశారు. శనివారం గజ ఈతగాళ్లను రంగంలోకి దింపాలని నిర్ణయించుకున్నారు. నవీన్‌కు తల్లిదండ్రులు లేరు. ఆయన గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్యాంబాబుకు కూడా తల్లిదండ్రులు లేరు. నానమ్మ వద్ద ఉంటున్నాడు. ఈతకోసం కుంటలోకి దిగంతో ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.



నవీన్ మృతదేహం

అవీ..ఇవీ..

డోన్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

గిద్దలూరు, జూలై 19 : రైల్వేడబ్లింగ్ పనుల కారణంగా చాలాకాలంగా రద్ధయిన డోన్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పునరుద్ధరించారు. ఈ నెల 21 నుంచి గుంటూరు-గిద్దలూరు-డోన్ (17227) ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 22 నుంచి డోన్-గిద్దలూరు-గుంటూరు (17228) ఎక్స్‌ప్రెస్ యథావిధిగా గతంలో తిరిగే సమయాల్లోనే పగటిపూట తిరుగుతుందని రైల్వేఅధికారులు ప్రకటించారు. ఇదిలా వుండగా హుబ్లీ-గిద్దలూరు-విజయవాడ మధ్య తిరిగే ఎక్స్‌ప్రెస్‌ను కూడా పునరుద్ధరించాలని, కొవిడ్ సమయంలో రద్దయిన విజయవాడ- గిద్దలూరు- యశ్వంత్‌పూర్ ప్యాసింజర్ రైలును కూడా పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్ద దోర్నాల, జూలై 19 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సావిత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ బీఏ(పొలిటికల్ సైన్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (బోటనీ,హార్టికల్చర్)కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చెంచు, గిరిజనులకు దుస్తుల పంపిణీ

పెద్ద దోర్నాల, జులై 19: మండలంలోని పనుకు మడుగు చెంచుగిరిజన గ్రామంలో గిరిజనులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో శుక్రవారం దుస్తుల పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు రాముడు, శ్రీనివాస చౌదరి, రమేష్ రెడ్డి, వెంకటయ్య, మణికంఠ గూడేనికి చెందిన 100 మందికి దుస్తులు అందజేశారు. మునుముందు మరిన్ని సేవలందించనున్నట్లు వారు తెలిపారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభానికి కసరత్తు

గిద్దలూరు టౌన్, జూలై 19 : రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి అన్నా క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభు త్వం కసరత్తు చేస్తోంది. ఆ దిశగా పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా గతంలో నిర్మించిన అన్నా క్యాంటీన్ భవనాన్ని శుక్ర వారం టీడీపీ నేత కృష్ణకిశోర్‌రెడ్డి పరిశీలించారు. 2014-19 కాలం గిద్దలూరులో అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్నా క్యాంటీన్‌ను రద్దు చేసింది. ఆ భవనంలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్లను ప్రారంభి స్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొనడంతో స్థానికంగా అన్నాక్యాంటీన్ బిల్డింగ్‌ను కృష్ణకిషోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లొక్కు రమేష్, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

అమ్మవార్లకు ఆషాడ పట్టె



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 19: ఆషాడమాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు ఆషాడ పట్టె అందజేశారు. ఆషాడ శుద్ధ త్రయోదశి శుక్రవారం మార్కండేశ్వర స్వామి ఆలయంలోని జగదాంబ మాతకు, జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలోని సరస్వతి అమ్మవారికి, ఆనంద రామాలయంలోని సీతాదేవి అమ్మవారికి జగదాంబ అమ్మవారి భక్త బృందం ఆధ్వర్యంలో ఆషాడ పట్టె(వడిబియ్యపు సారె) అంద జేశారు. అర్చకులు వరుణ్‌తేజ శర్మ, జొన్నాబట్ల రాముశర్మల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. మహిళలు అమ్మవార్లకు పసుపు, కుంకుమ సారెలు సమర్పిం చారు.

వందరోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

● హౌసింగ్ ఈఈ దాశరథిశర్మ

ఎర్రగొండపాలెం, జూలై 19 : లే-అవుట్ కాలనీలలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాల పనులు 100 రోజుల్లో పూర్తి చేయాలని మార్కాపురం డివిజన్ హౌసింగ్ ఈఈ దాశరథిశర్మ అన్నారు. ఎర్రగొండపాలెంలో శుక్రవారం పక్కాగృహాలపై నియోజకవర్గ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో మొదటి విడతలో 3581 పక్కాగృహాలు మంజూరు కాగా ఇప్పటికీ 1532 పూర్తయ్యాయన్నారు. దర్వాజా లెవెల్ 51, కప్పు వేయాల్సినవి 226,కప్పు వేసినవి 148 పక్కాగృహాల నిర్మాణం పనులు జరుగుతున్నాయని వాటిని వంద రోజుల్లో పూర్తి చేయాలన్నారు. బేస్‌మట్టం లెవెల్‌ఉన్న 848 పక్కాగృహాల నిర్మాణాలను డిసెంబరు లోపు పూర్తి చేయాలన్నారు. పునాదుల దశలో ఉన్న 705 నిర్మాణాలను 2025 మార్చిలోపు పూర్తి చేయాలని సూచించారు. పక్కా గృహాల పథకం కింద మంజూరైన లబ్దిదారులు అందరూ ఇళ్లు నిర్మించుకునే దశల వారిగా బిల్లులు చెల్లిస్తామని అన్నారు. ప్రతి గృహానికి రూ.1.80 లక్షల స్కీం కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ డీఈ వెంకటసురేష్‌బాబు, ఐదు మండలాల ఏఈలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన

గిద్దలూరు, జూలై 19 : డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, కాచివడపోసిన నీటిని తాగాలని, ఆహారం వేడిగా ఉన్నపుడే భుజించాలని, జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ రంగనాయకులు, సూపర్‌వైజర్ సుధారాణి, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శనీయం



పాదయాత్ర చేస్తున్న శివశంకరన్

గిద్దలూరు, జూలై 19 : భారతదేశ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమని శివ సేవక్ మహాత్మ వైష్ణోందాస్ శివకరన్ అన్నారు. మహారాష్ట్రలోని కరోని గ్రామం నుంచి తల్లిదండ్రులు, గ్రామస్థుల ఆశీర్వాదంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేస్తున్న పాదయాత్రలో భాగంగా శివకరన్ శుక్రవారం గిద్దలూరు చేరుకున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి ఆయన స్వాగతం పలికారు. రామకృష్ణ ధ్యానమందిరానికి తీసుకుని వెళ్లారు. 2022 మార్చి 25న కరోని నుంచి పాదయాత్ర మొదలు పెట్టినట్లు పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ సన్నగిల్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. వ్యసనాలకు అలవాటు పడ్డ యువతకు విముక్తి కల్పించి దేశప్రయోజనాల కోసం వారిని తయారు చేసేందుకు అభద్రత భావంతో ఉన్న వారికి ధైర్యం చెప్పేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డీవో తనిఖీ

పొదిలి, జూలై 19 : పొదిలి తహసీల్దార్ కార్యాలయాన్ని, సచివాలయాలను కనిగిరి ఆర్‌డీవో జాన్‌ఎర్విన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులపట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రైతులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పని చేయాలని సూచించారు. కార్యాలయంలో ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను విని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాకులు చెప్పకుండా బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఫిర్యాదు వచ్చినా, ఏదైనా తప్పు చేసినట్లు నిర్ధారణ అయినా ఉపేక్షించేది లేదని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ మహ్మద్‌జియా రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దేవదాయశాఖ పరిధిలోకి ఆలయం

గిద్దలూరు టౌన్, జూలై 19 : గిద్దలూరులోని రేడియోబావి కూడలిలోని అభయాంజనేయస్వామి దేవస్థానం దేవదాయ, ధర్మాదాయ పరిధిలోకి వెళ్లింది. ఈ దేవాలయానికి సింగిల్ ట్రస్టీగా కొనసాగుతున్న పాలుగుళ్ల అనసూయమ్మ గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి చిక్కుడు శ్రీనివాసులు అప్యూమ్ చేసి బాధ్యతలు తీసుకున్నారు. దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ, పోలీసు దేవాదాయ సిబ్బంది సమక్షంలో ఆలయంలోని విలువైన వస్తువులకు పంచనామ నిర్వహించారు. ఇప్పటినుంచి ఆలయ పరిపాలన విధులు తమ పరిధిలో ఉంటాయని కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తెలిపారు.



కుంటను తలపిస్తున్న కంభం రోడ్డు

ఆ రోడ్డంటే భయం.. భయం..!

కంభం రోడ్డులో భారీ గుంతలు పడినా పట్టించుకోని గత పాలకులు

ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రపై విశ్వాసం ఉంచిన ప్రజలు

కనిగిరి, జూలై 19 : నియోజకవర్గంలోని హనుమంతునిపాడు - కంభం రోడ్డంటే వాహనదారులు, భారీ వాహనాల డ్రైవర్లకు భయం వెంటాడుతుంది. కనిగిరి నుంచి హనుమంతునిపాడు వెళ్లే రోడ్డంతా గుంతల మయమైంది. వర్షం పడిందంటే ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక చాలామంది వాహనదారులు వాటిల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. గత పాలకుల నిర్వాకం వలన ఆ రోడ్డు అధ్వానంగా తయారైంది. కంభం వయా వేములపాడు మీదుగా గిద్దలూరు, మార్కాపురం, కర్నూలు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గం ద్వారానే వెళ్లాలి. కనిగిరి పరిధిలోని గ్రానైట్ వాహనాలు నిత్యం రాత్రిళ్లు ఈ మార్గం ద్వారానే వివిధ ప్రాంతాలకు గ్రానైట్ భారీ వాహనాలు వెళ్తుంటాయి. దీంతో రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడింది. గత ప్రభుత్వంలో కంభం రోడ్డు అభివృద్ధి చేపడతామని హామీ ఇచ్చిన నేతలు పత్తా లేకుండా పోయారు. ఓట్లు వేయించుకుని గెలిచిన గత వైసీపీ పాలకులు రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో హనుమంతునిపాడు మండలంలో వైసీపీకి 5వేల ఓట్లు మెజార్టీ కట్టబెట్టిన ప్రజల నమ్మకాన్ని గత పాలకులు పాతరేశారు. టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మీదనే మండల ప్రజలు ఆశలుపెట్టుకున్నారు.

ప్రమాదభరితంగా గుంత



ప్రధాన రహదారిపై ప్రమాదంగా గుంత

దర్శి, జూలై 19 : దర్శి పట్టణంలోని తూర్పుచౌటపాలెం రోడ్డులో మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నడిరోడ్డుపై ఉన్న గుంట ప్రమాదభరితంగా మారింది. వాహన చోదకులు ఆదమరిచి గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఎన్ఎపీ పైపులైన్ దెబ్బతినటంతో మరమ్మతులు చేసేందుకు సీసీ రోడ్డు పగులకొట్టి గుంత తీశారు. ఆ తర్వాత తవ్విన మట్టిని మాత్రమే గుంటలో పోసి వదిలేశారు. వర్షాలకు గుంట మరింత పెద్దదై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు వెంటనే గుంత పూడ్చాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఎమ్మార్సీ భవనం



కాలం చెల్లిన ఎమ్మార్సీ భవనం

దర్శి జూలై 19 : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఎమ్మార్సీ భవనం కూలేదశకు చేరింది. గోడలు నెర్రలిచ్చాయి. పైకప్పు దిబ్బతింది. గతంలో ఆ భవనంలో విద్యాశాఖ కార్యాలయం కొనసాగింది. భవనం పూర్తిగా దెబ్బతినటంతో విద్యాశాఖ కార్యాలయాన్ని ఎదురుగా ఉన్న భవనంలోకి మార్చారు. కొన్నేళ్లుగా ఎమ్మార్సీ భవనం అలాగే ఉంది. తలుపులు, కిటికీలు తుప్పుపట్టిపోతున్నాయి. లోపల విషపురుగులు సంచరిస్తున్నాయి. కాలం చెల్లిన భవనాన్ని కూల్చి వేయాలని స్థానిక అధికారులు ఉన్నతాధికారుల అనుమతి కోసం నివేదిక పంపినా పట్టించుకున్న నాథుడు లేడు.



నేరేళ్ల వాగుపై అసంపూర్తిగా బ్రిడ్జి

వాగు దాటితేనే ఇంటికి..!

ఉగ్ర పైనే గ్రామస్థుల ఆశలు

పామూరు, జూలై 19 : మండలంలోని కంభాలదిన్నె పంచాయతీ పరిధిలోని రజాసాహేబ్ పేట గ్రామానికి వెళ్లేందుకు మార్గమధ్యలో నేరేళ్లవాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆర్ఎస్‌పేట గ్రామంలో సుమారుగా 150 వరకు వివిధ సామాజిక వర్గాలు జీవిస్తున్నారు. గ్రామం నుంచి వేరే గ్రామానికి వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాల వారు గ్రామానికి రావాలన్నా సరైన రోడ్డు సౌకర్యంలేదు. పామూరుకు రావాలంటే మధ్యలోని నేరేళ్లవాగులో మోకాలు నీటిలో నడిచి రావాల్సిందే. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో వారికి బయటి ప్రాంతాలకు అనుసంధానం ఉండదు. ఈ అవస్థలపై అప్పటి ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు విజ్ఞప్తి మేరకు 2004లో అప్పటి ఒంగోలు ఎంపీ కరణం బలరామకృష్ణమూర్తి తన నిధుల నుంచి రూ. 6.5లక్షల నిధులు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేశారు. అప్పటి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి సరైన అంచనాలు ఇవ్వలేదు. దీంతో నిధులు సరిపోక పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఆ వంతెన అలానే వెక్కిరిస్తోంది. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే ఉగ్ర అయినా వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలి

సీఎస్‌పురం(పామూరు) జూలై 19 : బీజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను పార్టీ శ్రేణులు చేపట్టాలని బీజేపీ కనిగిరి అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య సూచించారు. సీఎస్‌పురంలో బీజేపీ శ్రేణులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు ఇండ్ల వెంకటసత్యం, పెనమాల చెన్నయ్య, రేబ్బానాయుడు, మన్నేపల్లి మాల్యాద్రి, సంగిశెట్టి అనిల్, ఉమ్మడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పామూరులో మోస్తరు వాన

పామూరు, జూలై 19 : బంగాళఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో పామూరు, సీఎస్‌పురం, మండలాల్లో శుక్రవారం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. దాంతో వ్యవసాయ భూములు పదునెక్కాయి. శుక్రవారం ఉదయం నుంచి పలుమార్లు నిరాటంకంగా వర్షం కురుస్తుండటంతో ప్రజా జీవనానికి అంతరాయం ఏర్పడింది.

23న ప్రత్యేక ఆధార్ క్యాంప్

పామూరు, జూలై 19 : పామూరు గ్రామ సచివాలయ కేంద్రంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వి. బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పామూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుపౌర్ణమి అన్నదానానికి విరాళం

పామూరు, జూలై 19 : పామూరు పాత పోస్టాఫీసు వద్ద ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 21వ తేదీ జరుగు గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భారీ అన్నదాన కార్యక్రమానికి కేసీపీ సిమెంటు అధినేత్రి విల్ ఇందిరాదత్తు రూ. 1.50లక్షల విరాళం అందజేసినట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ పబ్బర్తి వెంకటసుబ్బయ్య తెలిపారు. సుమారు 4 వేల మందికి అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పామూరు కేజీబీవీలో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న జీసీడీవో మాధవీలత

పామూరు, జూలై 19 : స్థానిక కేజీబీవీ పాఠశాలను సమగ్ర శిక్ష అధికారి జీసీడీవో సీహెచ్ మాధవీలత శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. రానున్న 10, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. పాఠశాలలో సమస్యలు, వసతుల గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వంటశాల, వాష్‌రూంలను పరిశీలించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సజన తో కలిసి స్టాఫ్‌తో సమావేశమయ్యారు.

స్వల్పంగా కంపించిన భూమి

పీసీపల్లి, జూలై 19 : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. గుదేవారిపాలెం, మారెళ్ల, పెదఅలవలపాడు, రామాపురం గ్రామాల్లో భూమి కంపించింది. ఉదయం 8గంటల సమయంలో రెండు సెకన్ల పాటు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇళ్లల్లో అటకలపై ఉన్న వస్తువులు కదిలాడాయి. ఈ ప్రకంపనలతో ఉలిక్కిపడ్డ ప్రజలు ఒక్కసారిగా ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు.

నాణ్యమైన బియ్యం పంపిణీ

కురిచేడు, జూలై 19 : ప్రభుత్వం రైతు బజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల ద్వారా తక్కువ రేటుకే బియ్యం, కందిపప్పు అమ్మేలా ఏర్పాట్లు చేపట్టింది. కురిచేడులో 3 దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ కార్యాలయ డీటీ రాధాక్రిష్ణ తెలిపారు. కురిచేడులో వినుకొండ రోడ్డులో ఓ దుకాణాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ బీపీటీ రకం బియ్యం కేజీ రూ.48, స్టీమ్డ్ బియ్యం రూ.49, కందిపప్పు రూ.160 లెక్కన అమ్ముతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొఘల్ మస్తాన్‌వలి, షేక్ సునీల్, గంధం గురునాథం, ఎలిశెట్టి శ్రీనివాసులు, బాదం సుబ్బారెడ్డి, కాశీ విశ్వనాథరావు, దాసరి రవి, అంకయ్య, నాగరాజు, కోటిలింగయ్య, పాపిశెట్టి వెంకట రామయ్య, కొండలు, వీఆర్వో సరోజని పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలి



లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న బాలకృష్ణ

దర్శి, జూలై 19 : టీడీపీ విజయం కోసం కష్టించి పనిచేసిన వారిని గుర్తించి న్యాయం చేయాలని నియోజకవర్గ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి గుర్రం బాలకృష్ణ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో లోకేష్‌ను కలిసి తొలుత టీడీపీ అధికారంలోకి రావటం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ సమస్యలను లోకేష్ అడిగి తెలుసుకున్నారని బాలకృష్ణ తెలిపారు.

రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లాను కలిసిన గొల్లపూడి



పల్లాతో గొల్లపూడి

తాళ్లూరు, జూలై 19 : రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు టీడీపీ గెలుపునకు కష్టపడి పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు ఉన్నారు.

కార్యదర్శుల కొరత

తాళ్లూరు మండలంలో ఎనిమిది గ్రామాలకు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు లేరు

ఐదోచోట్ల ఒకరే ఇన్‌చార్జి బాధ్యతలు

పాలన సాఫీగా సాగక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వర్షాకాలం కావడంతో క్షీణిస్తున్న పారిశుధ్యం

ప్రభుత్వం మారినా ఉన్నతాధికారుల తీరు అంతే



తూర్పుగంగవరం గ్రామసచివాలయం

తాళ్లూరు, జూలై 19 : మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేక పాలన కుంటు పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 14 గ్రామసచివాలయాలు ఉండగా 7 చోట్ల పంచాయతీ కార్యదర్శులు లేరు. మేజర్ పంచాయతీ తూర్పుగంగవరం పంచాయతీ కార్యదర్శి 4గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. లక్కవరం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి ఆవుల సుజాత లంచం తీసుకుంటూ రెండేళ్ల క్రితం ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆమెను సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో ఇన్‌చార్జిని నియమించారు.

గత ఏడాది జరిగిన సాధారణ బదిలీలలో శివరాంపురం, విఠలాపురం, రామభద్రాపురం గ్రామాల కార్యదర్శులు బదిలీపై వెళ్లగా వారి స్థానే ఎవరూ నియమించలేదు. దీంతో ఆ గ్రామపంచాయతీలకు ఇన్‌చార్జులను నియమించారు. మల్కాపురం పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ విఠలాపురం, లక్కవరం గ్రామపంచాయతీలకు ఇన్‌చార్జిగా ఉన్నారు. లక్కవరం గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు మల్కాపురం పంచాయతీ కార్యదర్శిని డీపీవో 5నెలల క్రితం సస్పెండ్ చేశారు. దీంతో మల్కాపురం, విఠలాపురం, లక్కవరం పంచాయతీలకు కార్యదర్శుల కొరత ఏర్పడింది. నాగంబొట్లపాలెం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి పురం నరేంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన స్థానే ఎవరినీ నియమించలేదు.

ఒక్కరే ఐదు గ్రామాలకు కార్యదర్శి...

తూర్పుగంగవరం రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి టి.అజయ్‌కీర్తి విఠలాపురం, నాగంబొట్లపాలెం, రామభద్రాపురం, లక్కవరం పంచాయతీలకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. 5 గ్రామపంచాయతీలు ఉండటంతో అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించటం కష్టతరంగా ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వీధులన్నీ రోతగా తయారయ్యాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పంచాయతీ కార్యదర్శి కోసం సచివాలయాల వద్దకు వెళితే అందుబాటులో ఉంటే అవకాశం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాధవరం పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు మల్కాపురం ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్నారు. శివరాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పక్కమండలమైన ముండ్లమూరు నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. తురకపాలెం, దోసకాయలపాడు పంచాయతీలకు కార్యదర్శులు లేరు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లగా వైసీపీ పాలకులు రెగ్యులర్ కార్యదర్శులను నియమించటంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి రాగానే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శుల నియామకాలు జరుగుతాయని ప్రజలు ఎదురు చూడగా వారి ఆశలు అడియాశలయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చినెల దాటినా పంచాయతీ కార్యదర్శుల నియామకం జరగలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఖాళీగా ఉన్న స్థానాల్లో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులను నియమించి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి మండలంలో జనసేన పార్టీ కార్యాలయాలు



జనసేనలో చేర్చుకుంటున్న గరికపాటి వెంకట్

దొనకొండ, జూలై 19 : నియోజకవర్గంలోని ప్రతి మండలంలో జనసేన పార్టీ కార్యాలయాలను త్వరలో ప్రారంభించనున్నట్లు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి గరికపాటి వెంకట్ చెప్పారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన దొనకొండ విచ్చేశారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుండాల నాగేంద్రప్రసాద్ నేతృత్వంలో ఎంపిక చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం బేతేల్‌పురం, బాదాపురం గ్రామాలకు చెంది వివిధ పార్టీలకు చెందిన పలువురికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినందున పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. దొనకొండలో వెయ్యి మందికి పైగా జనసేన పార్టీ సభ్యత్వం పొంది రికార్డు సృష్టించనున్నట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్, ఆసా సాంబశివరావు, కె బాబి పాల్గొన్నారు. జనసేన పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఐజక్‌ను నియమిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి గరికపాటి వెంకట్ ప్రకటించారు.

అంగన్వాడీ కార్యకర్తపై ఫిర్యాదు.. సీడీపీవో విచారణ

పీసీపల్లి, జూలై 19 : గత వైసీపీ ప్రభుత్వంలో నియమించిన అంగన్వాడీ కార్యకర్త స్థానికురాలు కాదని ఆరోపిస్తూ కొంతమంది గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు కనిగిరి ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని శుక్రవారం విచారణ జరిపారు. సీడీపీవో తెలిపిన వివరాల మేరకు... కోదండరామపురం మినీ అంగన్వాడీ కార్యకర్తగా గుర్రం ఐశ్వర్యను నియమిస్తూ ఈ ఏడాది మార్చి 12న (ఎన్నికలకు 2నెలల ముందు) ఉత్తర్వులు ఇచ్చారు. ఆమెపై వచ్చిన ఫిర్యాదు మేరకు సీడీపీవో శుక్రవారం కోదండరామపురం వెళ్లి విచారణ జరిపారు. కార్యకర్త వద్ద ఉన్న స్థానికత ఆధారాలను పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అంగన్వాడీ కేంద్రం వద్దకు వెళ్లి కార్యకర్త స్థానికురాలు కాదని, ఈమె కార్యకర్తగా ఉన్నంత కాలం పిల్లలను కేంద్రానికి కూ డా పంపబోమని సీడీపీవోకు చెప్పారు. ఆమె స్థానికురాలో కాదో విచారించి తమకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరినట్లు సీడీపీవో ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతి వాస్తవమే : డ్వామా పీడీ

కురిచేడు, జూలై 19 : మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి వాస్తవమే అని, అందుకు సంబంధించి సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టరుకు సిఫార్సు చేసినట్లు డ్వామా పీడీ అర్జునరావు చెప్పారు. మండలంలో ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై సామాజిక తనిఖీ బృందం బుధవారం రోజున ప్రజావేదిక నిర్వహించారు. ఈ వేదిక సాక్షిగా విచారణ బృందం రూ.10 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు తేల్చారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి జిల్లా పేజిలో ఉపాధి పనుల్లో అవినీతి శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా డ్వామా పీడీ అర్జున రావు వివరణ ఇచ్చారు. మొత్తం ఉపాధి పనుల్లో అవతవకలు జరిగిన మొత్తం రూ.34.22 లక్షలు అని, అందులో రూ.11.48 లక్షల అవినీతికి సంబంధించి సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు జిల్లా కలెక్టరుకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి సీపీఐ కృషి



గిరిజనులకు ఏర్పాటు చేసిన బోరును ప్రారంభిస్తున్న నేతలు

కనిగిరి, జూలై 19 : దళిత, గిరిజన కుటుంబాల సంక్షేమానికి సీపీఐ ఎనలేని కృషి చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై రవీంద్రబాబు చెప్పారు. పట్టణ శివారులోని టుబాకో బోర్డుకు సమీపంలో కొండదిగువన నివసిస్తున్న దళిత, గిరిజన కుటుంబాలకు మంచినీటి బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యాసిన్ కుమారుడు మహ్మద్ కైఫ్ జ్ఞాపకంగా రూ.70వేలతో బోరు వేయించినట్లు తెలిపారు. బోరు ఏర్పాటుతో దాదాపు 100 దళిత, గిరిజన కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అదేవిధంగా ఆయా కుటుంబాలు శాశ్వతంగా అక్కడ నివసించటానికి ఇంటి స్థలం పట్టా మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయా కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు శాసనసభ్యులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యాసిన్, ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు, పీ మోహన్, సుబ్బారావు, పవన్‌కళ్యాణ్, ఖాశింవలి పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

పత్రాలు ఎంపీడీవోకు అందజేత

వెలిగండ్ల, జులై 19 : గత ప్రభుత్వంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించిన ఇద్దరు స్వచ్ఛందంగా వైదొలిగారు. మండలంలోని మోటుపల్లి, మరపగుంట్ల పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ మేరకు ఎంపీడీవోకు రాజీనామ పత్రాలు అందజేశారు. మరికొందరు రాజీనామా చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో అంటకాగి ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన ఎఫ్ఏలు ప్రభుత్వం మారడంతో తమకు ఇబ్బందులు ఏర్పడతాయన్న భయంతో రాజీనామాలు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా గ్రా మా ల్లో అధికార పార్టీ కూటమి నేతలు తమపై విచారణ చేయిస్తే ఇబ్బందులు తప్పవన్న భయంతో వారు రాజీనామాలు చేస్తున్నట్లు తెలిసింది.

విద్యార్థుల దాహం కేకలు



మరమ్మతులకు గురైన బోరింగ్ పంపు

వెలిగండ్ల, జులై 19 : మండలంలోని జాళ్ల పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. పాఠశాలలో ఉన్న బోరింగ్ మూలనపడింది. మరమ్మతులు చేసేందుకు పంపును బయటకు తీసి అలాగే వదిలేశారని గ్రామస్థులు, విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలలో 20 మంది విద్యార్థులకు పైగా ఉన్నారు. వీరు మధ్యాహ్న భోజన సమయంలో ఇంటి దగ్గర నుంచి నీరు తెచ్చుకొని తాగుతున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు

దర్శి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

దర్శి, జూలై 19 : లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వజ్జా శ్రీనివాసరావు, కార్యదర్శిగా గన్నమనేని శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా అప్పికట్ల ఆదినారాయణ, మరికొంతమంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపారు.





తెనాలి మండలం నేలపాడు వద్ద నీటమునిగిన వరి పైర్లు

ముసురు

- జిల్లా అంతటా వర్షాలు
- ఎడతెరిపిలేని వర్షంతో రైతుల్లో హర్షం

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, జూలై 19: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఈ సీజన్‌లో ఈ స్థాయిలో వర్షం పడటం ఇదే కావడంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చిరువ్యాపారులు, రోడ్ల పై విక్రయాలతో జీవనం సాగించే వారు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాచర్ల మండలంలోని ఎత్తిపోతల జలపాతం జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు భారీ గా వచ్చి చేరడంతో 72 అడుగుల ఎత్తు నుంచి జా లువారుతున్న ఎత్తిపోతల జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. భారీ వర్షాలు కాకపోయినా ఎడతెరిపిలేని వర్షాలతో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లో తట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కూడా మునిగి తటాకాలను తలపి స్తున్నాయి. దీంతో కొన్ని చోట్ల వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వర్షాలు పల్నాడులో వివిధ పంటలకు జీవం పోశాయి. పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని, ఇప్పటికే వేసిన పత్తి పంటకు మేలు జరుగుతుందని రైతులు చెప్పారు. ఈ వర్షాలు నారుమళ్లకు ఊపిరిపోస్తే, డెల్టాలో వచ్చిరొట్ట సాగు చేసిన భూములకు దమ్ము చేసుకునేందుకు నీటి కొరతను తీర్చింది.



రేపల్లె : పెనుమూడి వద్ద వర్షాల కారణంగా నీటమునిగిన వెదపొలం

లంకల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లూరులోని ముంపు ప్రాంతాల్లో బాపట్ల కలెక్టర్ పర్యటన

కొల్లూరు: భారీ వర్షాల వల్ల కృష్ణానదికి వరద ముంపు పొంచి ఉందని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. శుక్రవారం ఆయన కొల్లూరు మం డలంలోని వ రద ముంపు ప్రాం తా ల్లో పర్య టిం చారు. తొ లుత అర వింద వారధి వద్ద గండి పూడ్చివేత పనులను పరిశీలించారు. అనంతరం చిలుమూరులంక, సుగ్గునలంక గ్రామాల్లో పర్య టించారు. వరద తీవ్రతను బట్టి అధికారులు ఇచ్చే సూచనల మేరకు గ్రామాలను విడిచి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని గ్రామస్తులకు తెలిపారు. కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమీక్షలో అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వరద వల్ల ఒక్క ప్రాణనష్టం కూడా జరగకూడదన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరద ముప్పును ఎదుర్కోవడానికి సిద్ధం కావాలన్నారు. వరద ప్రాంతాల్లో ప్రజలను కాపాడేందుకు 56 బోట్లు, 100 మంది గజ ఈతగాళ్లు, ఎన్‌డీపీ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రకాశం బ్యారేజీకి 12 అడుగులకు మించితే నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. నీటి ప్రవాహంపై లంక గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.



అరవింద వారధి వద్ద గండిపడిన ప్రదేశాన్ని చూస్తున్న కలెక్టర్ వెంకటరమణ

డెల్టాలో.. గుబులు

- ఇటు వర్షాలు.. అటు పట్టిసీమ నీరు
- వెద సాగు చేపట్టిన రైతుల్లో ఆందోళన

తెనాలి(ఆంధ్రజ్యోతి): ఒక పక్క పట్టిసీమ నీరు.. మరోపక్క వానలు డెల్టా రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. వెద సాగుచేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. పుష్కలంగా నీరు ఉందని సాగుకు ఢోకా ఉండదనే ఆనందంలో మిగిలిన రైతులు ఉన్నారు. గత నాలుగేళ్లుగా జలాశయాల్లో నీరు అందుబాటులో లేకున్నా వైసీపీ సర్కారు పట్టిసీమను పట్టించుకోలేదు. అయితే ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టిసీమపై దృష్టిపెట్టి సకాలంలో మరమ్మతులు పూర్తిచేసి నీటిని విడుదల చేసింది. అదనుకు నీరు అందడంతో వ్యవసాయ పనులు పదిరోజుల నుంచే డెల్టాలో పలువురు రైతులు మొదలు పెట్టేశారు. దీనికితోడు అల్పపీడనం కారణంగా వదలకుండా వర్షం పడుతుండడంతో నీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చింది. పచ్చిరొట్ట వేసిన మొక్కలను దమ్ముచేయటానికి నీటికోసం ఎదురుచూడాల్సిన పనిలేకుండా చేలల్లోనే నీరు నిల్వ ఉండటంతో అంతా అనుకూలమైంది. వెద పద్ధతిలో విత్తులు నాటిన రైతులకు మాత్రం కష్టం వచ్చిపడింది. ప్రధానంగా వర్షాలకు ముందు విత్తు చల్లిన రైతులకు నిరాశే మిగిలింది. మొలకలు వచ్చిన చేలన్నీ నీట మునిగి ఉండటంతో పంట దెబ్బ తినిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్కువ ఖర్చుతో వరి సాగు చేద్దామని పలువురు రైతులు వెదసాగు ప్రారంభించారు. మొలకలు వచ్చినా పర్వాలేదనుకున్న సమయంలో వర్షం కొంపముంచిందంటూ రైతులు విలపిస్తున్నారు. ఈ నెలలో వెదచల్లిన చేలల్లోనూ నీరు నిల్వ ఉండటం, రెండు రోజులుగా నీరు బయటకు పోకపోవడంతో పైరు కుళ్లిపోతుందనేది రైతుల ఆందో ళన. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు, పెదకాకాని మండలాల్లో, అటు బాపట్ల జిల్లాలోని వేమూరు, అమృతలూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో వెద సాగుకు వర్షం నష్టం కలిగించింది. విత్తు చల్లడానికి ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు రైతులు ఖర్చు చేయడంతో అదంతా కోల్పోవాల్సి వస్తుందనేది రైతుల ఆవేదన. ఇప్పటి వరకు పడిన వర్షం వల్ల చేలన్నీ చెరువులుగా మారిపోతే, ఈ వర్షం ఇంతటితో ఆగిపోతే కొంతవరకైనా బయటపడతామని రైతులు ఆశతో ఉన్నారు. అయితే ఇది మరింత ఉధృతం అవుతుందన్న వార్తలతో డెల్టా రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. సాగు పనులు మాత్రమే చేసిన రైతులకు మాత్రం ఏ ఇబ్బందీ లేదు. వర్షం తగ్గాక పనులకి అనుకూల వాతావరణం ఉంటుందన్న సంతోషంలో ఉన్నారు. వెద సాగు ప్రశ్నార్థకంగా మారింది.



నకరికల్లు ఇందిరమ్మ కాలనీ రోడ్డు దుస్థితి

విద్యుత్.. జాగ్రత్తలు

- సమస్యలపై కంట్రోల్ రూమ్ 9440817526
- వినియోగదారులకు అందుబాటులో టోల్ ఫ్రీ 1912

గుంటూరు: వర్షాల నేపథ్యంలో విద్యుత్ పరంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పరంగా నెలకొనే సమస్యలు, ప్రమాదాలకు సంబంధించి ప్రజలు, వినియోగదారుల కోసం కంట్రోల్ రూమ్‌కు 9440817526 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1912ను అం దుబాటులో ఉంచామన్నారు. ఏదైనా సమస్య, ప్రమాదానికి సంబంధించి ఆయా నెంబర్లకు ఫోన్ చేసి అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎక్కడైనా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు తెగిపడిపోయినా ప్రజలు వాటిని తాకరాదన్నారు. తడిచిన విద్యుత్ పోల్స్‌ను తాకవద్దని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు, శబ్దం వచ్చినా సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా సరఫరాలో అంతరాయాలు తలెత్తినా, వైర్లు తెగిపడినా, ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద సాంకేతిక సమస్యలొచ్చినా మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే వరకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ	ప్రస్తుత నీటి నిల్వ	వస్తున్న వరద నీరు	విడుదల చేస్తున్న నీరు
	టీఎంసీలలో	టీఎంసీలలో	క్యూసెక్కుల్లో	క్యూసెక్కుల్లో
అల్‌మట్టి	123.08	97.41	43,478	65,480
నారాయణపూర్	33.31	30.56	65,801	70,931
జూరాల	9.66	4.95	4,014	27,579
తుంగభద్ర	105.78	55.97	1,06,723	592
శ్రీశైలం	215.81	32.51	7,931	7,063
నాగార్జున సాగర్	312.05	123.50	8,462	6,562
పులిచింతల	45.77	0.74	154	50

కృష్ణమ్మ పరుగులు


ఆల్‌మట్టి, తుంగభద్రలకు జలకళ

- శ్రీశైలానికి స్వల్పంగా వరద.. అదేస్థాయిలో దిగువకు
- సాగర్ పరిధిలో సాగుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. దీందో ఆయా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆలమట్టి, తుంగభద్ర, నారాయణపూర్, జూరాల జలాశయాలకు భారీగా వరద నీరు వస్తుంది. దీంతో అవి జలకళను సంతరించుకున్నాయి. ఆల్‌మట్టి జలాశయంలోకి శుక్రవారం 43,478 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. ఇది క్రమంగా లక్ష క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆల్‌మట్టిలో 123.08 టీఎంసీలకు 97.41 టీఎంసీల నీరు చేరింది. ఆల్‌మట్టి డ్యామ్ గేట్లు తెరచి దిగువకు 65,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయానికి కూడా వరద నీరు వచ్చి చేరుతుంది. 1,06,723 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. తుంగభద్రలో 105.78 టీఎంసీలకు 55.97 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ఈ డ్యాంకు 65,801 క్యూసెక్కుల వరద వస్తోంది. నారాయణపూర్‌లో 33.13 టీఎంసీలకు 30.567 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇక్కడ నుంచి దిగువకు 70,931 క్యూసె క్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల జలాశయంలో 9.66 టీఎంసీలకు 6.99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల నుంచి 27,579 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయా జలాశయాలకు ఇదే ప్రవాహం కొనసాగితే శ్రీశైలం జలాశయానికి కూడా భారీగా వరద నీరు వస్తుందని అంచనా వేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు స్వల్పంగా వరద నీరు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. 7,931 క్యూసెక్కుల నీరు వస్తుండగా 7,063 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 8,462 కూసెక్కుల నీరు వస్తుంది. తాగు నీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 6,562 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సాగర్ కుడి కాల్వ పరిధిలో సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



ఆలమట్టి జలాశయం నుంచి దిగువకు వస్తున్న నీరు



మాచర్ల : జలకళతో ఎత్తిపోతల జలపాతం

పల్నాడులో.. 48 సెంమీ వర్షపాతం

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం వరకు 48.02 సెంమీ వర్షపాతం నమోదైంది. అమరావతి మండలంలో 40 మీమీ, మాచర్లలో 17 మీమీ, యడ్లపాడు 21.4, చిలకలూరిపేట 23.2, నాదెండ్ల 20.2, ముప్పాళ్ల 33.8, నరసరావుపేట 19.4, రొంపిచర్ల 35.4, నకరికల్లు 12.2, రాజుపాలెం 23.6, సత్తెనపల్లి 24.8, పెదకూరపాడు 17.4, క్రోసూరు 14.2, అచ్చంపేట 10.4, బెల్లంకొండ 18.6, దుర్గి 28.8, రెంటచింతల 12.6, గురజాల మండలంలో 10 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తహసీల్దార్లు.. వెనక్కు



- ఎన్నికల బదిలీ స్థానాల నుంచి నేడు రిలీవ్?
- గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 53 మంది బదిలీ

గుంటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లందరినీ వారి సొంత జిల్లాలకు పంపించేయాల్సిందిగా రెవెన్యూ శాఖ ఆదేశించింది. అయితే వారిని సొంత రెవెన్యూ డివిజన్లలో మాత్రం పోస్టింగ్ చేయొద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి ఆర్‌పీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎవరైతే ఎన్నికల విధుల కోసం ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చారో వారందరిని శని, ఆదివారాల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు రిలీవ్ చేయనున్నారు. అలానే ఎలక్షన్ డ్యూటీల కోసం ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు వచ్చే వారం కలెక్టరేట్లకు వచ్చి కలెక్టర్లకు రిపోర్ట్ చేయనున్నారు. అనంతరం వారికి మండలాలు, కలెక్టరేట్‌లు, డివిజన్ కార్యాలయాల్లో పోస్టింగ్‌లు కల్పించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 31న ఉమ్మడి గుంటూరు జిల్లాలో 62 మంది తహసీల్దార్లున్నారు. వారిలో అప్పటికి జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకోని వారు ఆరుగురు, ఉద్యోగ విరమణకు దగ్గరలో మరో ముగ్గురున్నారు. దాంతో ఈ తొమ్మిది మందిని ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే కొనసాగించి మిగతా 53 మందిని బదిలీ చేశారు. గుంటూరు జిల్లా నుంచి జీవీఎస్ ఫణీంద్ర బాబు(తాడికొండ),శ్రీకాంత్ కేదార్‌నాథ్ (పొన్నూరు), జీ సిద్ధార (ప్రత్తిపాడు), కే సాంబశివరావు(గుంటూరు పశ్చిమ), షేక్ మెహబూబ్ బాషా(పెదనందిపాడు), కే మల్లీశ్వరి(దుగ్గిరాల), జీ నాంచారయ్య (కొల్లిపర), డీ పద్మనాభుడు(ఫిరంగిపురం), కే రవిబాబు(తెనాలి), కే నాసరయ్య(వట్టిచెరుకూరు), కేశ్రీనివాసశర్మ(మేడికొండూరు), కే కల్యాణి (తుళ్లూరు), జే ప్రసాదరావు(కాకుమాను), ఎం నాగిరెడ్డి(తాడేపల్లి), కేఎస్ చక్రవర్తి(పిడుగురాళ్ల), జీ కరుణకుమార్(దాచేపల్లి), ఎం డానియేల్(గురజాల), జీ రమేష్‌కుమార్(దుర్గి), షేక్ మొహమ్మద్ హుస్సేన్ (మాచర్ల), బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్(మాచవరం), కే పుల్లారావు (రెంటచింతల), జీ శ్రీనివాస్(కారంపూడి), ఎస్ దురేశ్వరరావు(బెల్లంకొండ), ఎస్ సురేష్(సత్తెనపల్లి), జీ విజయశ్రీ(అమరావతి), ఎండీ జియావుల్‌హక్ (క్రోసూరు), ఎం క్షమారాణి (పెదకూరపాడు), ఎం భవానీశంకర్ (ముప్పాళ్ల), పీ సునీత (రొంపిచర్ల), కే నగేష్(ఈపూరు), జీ సుజాత (చిలకలూరిపేట), ఏవీ రమణ(నాదెండ్ల), ఎస్ నాగమల్లేశ్వరరావు (యడ్లపాడు), జే మధు బాబు(నూజెండ్ల), బీ కిరణ్‌కుమార్ (వినుకొండ), సీహెచ్ పద్మాదేవి (అచ్చంపేట),ఏవీ సుధాకర్(బొల్లాపల్లి), టీ మస్తాన్ (సత్తెనపల్లి డీఏవో), ఆర్ యశోధ(పల్నాడు కలెక్టరేట్), కే సుజాత(బాపట్ల), పీ మెహర్‌కుమార్(అమర్తలూరు), డీ వెంకటేశ్వరరావు(భట్టిప్రోలు), బీ వెంకటేశ్వర్లు(చెరుకుపల్లి), ఏ శ్రీనివాస రావు(కొల్లూరు), డీ మల్లికార్జునరావు(రేపల్లె), కే రవికుమార్ (చుండూరు), డీ నాగరాజా రావు(వేమూరు), బీ సుశీల(కొరిశపాడు), పీ సురేష్ బాబు(మార్టూరు)లు బదిలీపై వేరే జిల్లాలకు వెళ్లారు.

చంద్రబాబు ఆదేశాలతో ఉత్తర్వులు

బదిలీ అయిన తహసీల్దార్ల స్థానంలో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి తహసీల్దార్లు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చా రు. ఎన్నికల కోడ్ జూన్ 6నే ముగిసింది. అయితే ఈసీ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో వెనువెంటనే వారిని సొంత జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. తహసీల్దార్లతో పాటు ఏపీ రెవెన్యూ సర్వీ సెస్ అసోసియేషన్ నేతలు కొద్ది రోజుల నుంచి ఉన్నతా ధికారులను కలుస్తూ తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపాలని వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు అంగీకరించి ఆదేశా లు ఇవ్వడంతో శుక్రవారం రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీ నేతల చెరలో ప్రభుత్వ భూములు

- ప్రభుత్వం మారినా దృష్టిపెట్టని అధికారులు

అద్దంకి, జూలై 19: అద్దంకిలో విలువైన ప్రభుత్వ స్థలాలు వైసీపీ కౌన్సిలర్‌లు, నేతలు ఆక్రమించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆక్రమించుకుని హస్తగతం చేసుకున్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ నగర్ సమీపంలో ఊరచెరువులో సుమారు ఎకరం విస్తీర్ణంలో ఆక్రమించుకున్న వైసీపీ నేతలు దాన్ని ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేపట్టారు. కొద్ది మంది కొనుగోలు చేయగా మిగిలినవన్నీ వైసీపీ నేతల ఆధీనంలోనే ఉన్నాయి. ఊరచెరువు అభివృద్ధి పనులు చేపట్టే సమయంలోనే స్థానిక వైసీపీ నేతలు ముందస్తు ప్రణాళికతో తమ ఆక్రమణలకు వీలుగా చెరువు కట్టను దూరంగా జరిపి వేయించారు. ఇక 1 వ వార్డు పరిధిలో కూడా ప్రభుత్వ స్థలాలు వైసీపీ నేతల హస్తగతమైనట్లు ఆరోపణలున్నాయి. ఆర్‌వో ప్లాంట్ నిర్మాణం పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారన్న విమర్శలు వస్తున్నాయి. ఓ వైసీపీ మహిళా నేత నామ్ రోడ్డుకు అత్యంత సమీపంలో ఇప్పటికే పాగా వేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆటోనగర్ సమీపంలో మున్సిపాలిటీకి స్వాధీనం చేసిన స్థలం అన్యాక్రాంతంలో స్థానిక వైసీపీ నేతల హస్తం ఉంది. గోపాలపురం వద్ద, శింగరకొండపాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద కూడా యథేచ్ఛగా ఆక్రమణలు జరిగాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఆక్రమణల జోరు మరింత పెరిగింది.



అద్దంకి ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో వైసీపీ నాయకుల ఆక్రమణలోని ఊరచెరువు

ఫిర్యాదులు.. పరిశీలనలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ఆక్రమణలపై టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఊర చెరువులో ఆక్రమణలను ఇటీవల చీరాల ఆర్డీవో పరిశీలించారు. అయినా స్థానిక అధికారులు ఆక్రమణల తొలగింపుపై ఇంకా దృష్టి పెట్టకపోవటం విమర్శలకు తావిస్తోంది.

అట్రాసిటీ కేసులకు ప్రాధాన్యమివ్వాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 19: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. అత్యాచార నిరోధక చట్టం జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. ఏదైన సంఘటన జరగగానే ప్రాథమిక విచారణ చేసి, నిబంధనలను అనుసరించి తక్షణమే చార్జిషీట్ వేయాలన్నారు. 47 కేసులకు నష్టపరిహారం అందించడానికి రికార్డులు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం 83 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. అద్దంకి, గోవాడలో తక్షణమే శ్మశాన భూమి కేటాయించాలన్నారు.ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ బాధితులకు భరసా కల్పించి తక్షణమే సహాయ సహకారులు అందించేలా చూస్తామని తెలిపారు. ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకువస్తామన్నారు. అట్రాసిటీ బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. సమావేశంలో చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ జె.రాజాదేబోరా, సభ్యులు కట్టా శ్రీనివాసరావు, పి.ప్రసాదరావు, టి.సురేష్, జి.రాజారావు, జి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

కొమ్మమూరు గండ్లు పూడ్చిన తెలుగు తమ్ముళ్లు

పోతుకట్ల నేతలకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు



కాలువ గండ్లను ఇసుక బస్తాలతో పూడుస్తున్న తెలుగు తమ్ముళ్లు

పర్చూరు, జూలై 19 : గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన కొమ్మమూరు కాలువ గండ్లను పూడ్చేందుకు తెలుగు తమ్ముళ్లు కదిలారు. పర్చూరు మండలం పోతుకట్ల సమీపంలోని కొమ్మమూరు కాలువకు పలుచోట్లు గండ్లు పడ్డాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో నీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు గండ్లకు ఇసుక బస్తాలు, మట్టిని తీసుకువచ్చి కట్టలను పటిష్టం చేసే కార్యక్రమం చేశారు. దీంతో ఆప్రాంతం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శుక్రవారం నాయకులు, కార్యకర్తలను అభినందించారు. గ్రామ టీడీపీ శ్రేణులను సమన్వయం చేసి గండ్లు పూడ్చేందుకు ప్రత్యేక చొరవ చూపిన మానం హరిబాబును ఏలూరి అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే కొండయ్య



బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొండయ్య

చీరాల, జూలై 19 : నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే కొండయ్య సీఎం చంద్రబాబును కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య, తన చినకుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్‌తో కలసి సీఎంను కలిశారు. మొక్కను మర్యాదపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థితిగతులపై సీఎం చంద్రబాబు కొంతసేపు మాట్లాడారు. తీరప్రాంతంలో టూరిజం పరంగా అభివృద్ధి చర్యలు, టెక్స్‌టైల్ పార్కుకు నిధుల కేటాయింపు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, కుందేరు ఆధునికీకరణ, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలిసింది. అలాగే ఎమ్మెల్యే కొండయ్య కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీలను మర్యాద పూర్వకంగా కలిశారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- నిందితుడు చీరాల మండలం వాడరేవు వాసిగా గుర్తింపు



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ విజయభాస్కర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూలై 19: అతడు వ్యసనాలకు బానిసయ్యాడు.. ఈజీగా డబ్బు ఎలా సంపాదించాలని ఆలోచిస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లను పరిశీలించాడు. ఈ క్రమంలో రైళ్లలో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కొంతకాలంగా రైళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులు గళ్లు గప్పి తిరుగుతుండగా నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సీ విజయభాస్కర్ నిందితుడి వివరాలను శుక్రవారం వెల్లడించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన పెదాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకి అలియాస్ వెంకటేష్ కూలి చేసుకుంటూ జీవించేవాడు. ఈ క్రమంలో వ్యసనాలకు బానిసయ్యాడు. సంపాదించిన డబ్బు తన అవసరాలకే సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలన్ని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో రైళ్లలో దొంగతనాలు చేసే రీల్స్‌ను చూసి దొంగగా మారాడు. రైళ్లలో తిరుగుతూ ప్రయాణికులు ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌లు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను దొంగలించి వాటిని అమ్ముకొని వచ్చిన సొమ్ముతో జల్సాగా జీవించేవాడు. ఇటీవల చీరాలలో రైలు దొంగతనాలు అధికం కావడంతో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారంగా నిందితుడు వెంకటేశ్వర్లును గుర్తించారు. అతడి కదలికలపై నిఘా ఉంచి గురువారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. పలు రైళ్లలో నేరాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి రూ.3.81 లక్షల విలువ చేసే 62 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్, మూడు వాచ్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించిన చీరాల రైల్వే ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య, సిబ్బంది కే భాస్కర్, గోపి, లక్ష్మీనారాయణ, శ్రీనురాజు, బ్రహ్మయ్యలను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఒంగోలు ఇన్‌చార్జి సీఐ కె భుజంగరావు, నెల్లూరు, చీరాల ఎస్‌ఐలు మాలకొండయ్య, సీహెచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత



మిషన్‌ను అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 19: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టుమిషన్‌ను అందజేశారు. శుక్రవారం స్థానిక రోటరీ కార్యాలయంలో ఉన్నం శ్రీనివాసరావు జ్ఞాపకార్థం మనుమడు, మనుమరాలు ఆహన్స్ , రీతూషల సౌజన్యంతో కొత్తపేటకు చెందిన పేద మహిళ కొల్లిపర లావణ్యకు కుట్టు మిషన్‌ను రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. అలాగే రాజీవ్ కాలనీలోని మండల పరిషత్ కార్యాలయానికి 4 కుర్చీలను అందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ అధికారిణి ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, హెచ్ఎం కరి రామయ్య, కార్యదర్శి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మాలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, చిన్ని మురళికృష్ణ, ఆంజనేయులు, శ్రీరామమూర్తి, యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

చినగంజాం, జూలై 19 : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చినగంజాం విద్యుత్ శాఖ ఏఈ గణనారాయణ అన్నారు. వర్షాకాలంలో తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదని సూచించారు. విద్యుత్ లైన్‌కు చెట్టుకొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి తెలియచేయాలన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను, విద్యుత్‌కు సంబంధించిన వస్తువులను తడి చేతులతో ముట్టుకోరాదని అన్నారు. బయటపెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. చిన్నపిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్, టీవీ, ఫ్రిడ్జి, వాటర్‌మోటర్, కంప్యూటర్‌ల స్విచ్‌లను ఆఫ్ చేయాలని, లేనిచో షార్ట్ సర్క్యూట్ అవుతుందని తెలిపారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్‌వైరు ఏమైనా డ్యామేజ్ అయినచో సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రజలకు ఆరోగ్య రక్షణ ముఖ్యం

మేదరమెట్ల, జూలై 19: గ్రామీణ ప్రాంతాలల్లో ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని తహసీల్దార్ బి. సుశీల అన్నారు. శుక్రవారం పమిడిపాడులో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. గుండె వైద్య నిపుణుల బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈసీజీ, టూడీఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. యాంజియోగ్రామ్ పరీక్ష అవసరం అయిన వారికి ఆ రోగ్య శ్రీ ద్వారా పరీక్షలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం నాయకులు జాగర్లమూడి జయకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పొగాకు ఉత్పత్తి ఖరారు

వచ్చే సీజన్‌కు 105.27 మిలియన్ కిలోలకు అనుమతి

దక్షిణాదిలో పంట ఉత్పత్తి ఖరారు చేసిన పొగాకు బోర్డు
గతేడాది కన్నా 16.40 మిలియన్లు అధికంగా అనుమతి



గుంటూరు పొగాకు బోర్డు కార్యాలయంలోని బోర్డు పాలకమండలి సమావేశంలో చైర్మన్, ఈడీ, ఇతర సభ్యులు

ఒంగోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రానున్న సీజన్ రాష్ట్రంలో పొగాకు పంట ఉత్పత్తి లక్ష్యం పొగాకు బోర్డు ఖరారు చేసింది. 167 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా అందులో దక్షిణాదిలోని 105.27 మిలియన్లకు అనుమతి ఇచ్చింది. గడిచిన సీజన్‌తో పోల్చితే రాష్ట్రంలో 25 మిలియన్ల కిలోలు అధికంగా ఉత్పత్తి లక్ష్యం ఖరారు చేయగా దక్షిణాదికి 16.40 మిలియన్లు అదనంగా ఇచ్చింది. గుంటూరులోని పొగాకుబోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, కార్యదర్శి దివి వేణుగోపాల్, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన బోర్డు సభ్యులు, వివిధ స్థాయిల్లోని అధికారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి బోర్డు డైరెక్టర్లుగా ఉన్న పొద వరప్రసాదరావు, బోడ్డపాటి బ్రహ్మయ్యలు హాజరయ్యారు. గత సీజన్‌కు రాష్ట్రంలో ఇచ్చిన పంట ఉత్పత్తులను జరిగిన ఉత్పత్తి, ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్లతోపాటు అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్ భవిష్యత్, డిమాండ్, భారత పొగాకు వ్యాపారుల సంఘం ఇచ్చిన ఇండెంట్‌తో పాటు రైతులు కోరుతున్న ఉత్పత్తి అనుమతి లక్ష్యాలను చర్చించినట్లు సమాచారం.

భారీగా పెరిగే అవకాశం

గడిచిన సీజన్‌లో రాష్ట్రంలో 142 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతించగా ఒక్క దక్షిణాదిలోనే ఇంచుమించు 140 మిలియన్ల ఉత్పత్తి అయింది. ఉత్తరాదిలో మరో 60 మిలియన్లు వెరసి 200 మిలియన్లు వచ్చినట్లు సమాచారం. అదేసమయంలో రైతులు బ్యారన్‌కు 50 క్వింటాళ్ల మేర అనుమతి ఇవ్వాలని కోరుతూ వస్తున్నారు. గతంలో దక్షిణాదిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు ఇవ్వగా ప్రస్తుతం కోరుతున్న 50 క్వింటాళ్లు ఇస్తే ఇంకా భారీగా పంట ఉత్పత్తి పెరిగే పరిస్థితి ఉం ది. దీంతో ఇటు రైతులు కోరిన మేర ఇవ్వకుండా, అటు గతం కన్నా కొంతమేర పెంచుతూ 167 మిలియన కిలోలు ఉత్పత్తి లక్ష్యాన్ని ఖరా రు చేశారు. అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉన్న 11 వేలం కేంద్రాలకు సంబంధించి రెండు రీజియన్లలో 105.27 మిలియన్ కిలోలకు అనుమతించారు. గడిచిన సీజన్‌లో ఈ ప్రాంతంలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్ళ వంతున రెండు రీజియన్లలో కలిపి 88.87 మిలియన్ కిలోలకు అనుమతి ఇచ్చారు. అయితే ఇక్కడ 29,885 మంది రైతులు 24,130 బ్యారన్లకు లైసెన్సులు పొంది దాదాపు 72,345 హెక్టార్లలో పంట సాగు చేశారు. దీంతో ఏకంగా 140 మిలియన్ల పం ట ఉత్పత్తి అయింది. ఇప్పటి వరకు సుమారు 91 మిలియన్ కిలోలు కొనుగోలు చేశారు. అధికంగా ఉత్పత్తి అయిన మరో 49 మిలియన్ కి లోలు కొనుగోలుకు కేంద్రం నుంచి అనుమతి రాక వేలం నిలిచిపోయి రైతులు ఇళ్లలో పంట ఉంది. ఈ నేపథ్యంలో రైతులు కోరిన బ్యారన్‌కు 50 క్వింటాళ్ల ఉత్పత్తి అనుమతిని బోర్డు సభ్యులు అంగీకరించలేదు. అదేసమయంలో గతంలో ఇచ్చిన 36.50 క్వింటాళ్లను పెంచారు. తాజా లక్ష్యంలో ఎస్‌బీఎస్ రీజియన్‌లో బ్యారన్‌కు 41.75 క్వింటాళ్ల వంతున 49.26 మిలియన్లు,ఎస్‌ఎల్ఎస్ రీజియన్‌లో బ్యారన్‌కు 42.75 క్వింటాళ్ల వంతున 56.01 మిలియన్లు వెరసి దక్షిణాదిలో 105.27 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు సమావేశంలో అనుమతించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు వ్యక్తుల అరెస్టు



నిందితులతో అటవీశాఖ అధికారులు

కొమరోలు, జూలై19: అక్రమంగా తరలిస్తున్న 28 ఎర్రచందనపు దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి టాస్కుఫోర్సు స్టేషన్ సీఐ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కొమరోలు మండలంలోని అక్కపల్లి సమీపంలోని రాష్ట్రీయ రహదారి పక్కన కారులో ఎర్రచందనపు దుంగలు తరలిస్తుండటంతో వారిని కడప సబ్‌కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ సురేష్ టీం, అటవీశాఖ సిబ్బంది సహకారంతో వారిని చాకచక్యంగా అదుపులోనికి తీసుకున్నారు. కారులో ఉంచిన 17దుంగలు, కింద ఉన్న 11 దుంగలను, వాటిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్కుఫోర్సు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులకు తమిళనాడు స్మగ్లర్లకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించి ఆ దిశగా విచారిస్తున్నారు.

ఇకనైనా శవరాజకీయాలు మానుకో జగన్

వినుకొండ ఘటనపై మంత్రి స్వామి ఫైర్



మంత్రి స్వామి

ఒంగోలు, జూలై 19(ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా వినుకొండలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన హత్యను వైసీపీ అధ్యక్షుడు జగన్ టీడీపీకి ఆపాదిస్తున్నాడని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీస్వామి మండిపడ్డారు. ఆ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసిన స్వామి అసలు వినుకొండలో రషీద్ హత్యకు ముఖ్య కారకుడు జగన్ అన్నారు. హతుడు రషీద్, నిందితుడు జిలానీల మధ్య వైసీపీ హయాంలోనే గొడవలు జరిగాయని, ఆనాడే వాటిని నియంత్రించి ఉంటే ఇప్పుడు ఈ హత్య జరిగేదా? అని ప్రశ్నించారు. నాడు జగన్ చేసిన పాపానికి నేడు నిండు ప్రాణం బలైందన్నారు. సొంత బాబాయిని చంపించి దానిపై నారాసుర రక్త చరిత్ర అంటూ టీడీపీపైనా, చంద్రబాబు నాయుడుపైనా దుష్పచారం చేసిన నీచచరిత్ర జగన్‌ది అన్నారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. వైసీపీ హయాంలో వేలాదిమందిపై దాడులు, హత్యలు జరిగాయన్నారు. ఆ సమయంలో బాధితులను పరామర్శించేందుకు ప్రతిపక్ష నాయకులను వెళ్లకుండా పోలీసులను అడ్డుపెట్టి జగన్ నియంతృత్వంగా వ్యవహరించాడన్నారు. అయితే ప్రస్తుతం టీడీపీ పాలనలో జగన్ స్వేచ్ఛగా తన పర్యటనను తాను చేసుకునేలా అవకాశం కల్పించామని తెలిపారు. ప్రజలు కూడా నాడు వైసీపీ, నేడు టీడీపీ ప్రభుత్వాల మధ్య తేడాను గుర్తించాలని కోరారు. వ్యక్తిగత కక్షలతో తాజా జరిగిన సంఘటనలను టీడీపీకి ఆపాదిస్తూ రాజకీ య లబ్ధికోసం జగన్ చేస్తున్న శవ రాజకీయాలను ఇకనైనా మానుకోవాలని లేకుంటే ప్రజలు శాశ్వతంగా రాజకీయాల నుంచి మాన్పిస్తారని హెచ్చరించారు.

గిద్దలూరు సమీపంలో రోడ్డు ప్రమాదం

పల్నాడు జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

గిద్దలూరు టౌన్, జూలై 19 : డివిజన్ కేంద్రం గిద్దలూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారికి గాయాలయ్యాయి. గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ బీవీ రంగారావు పల్నాడు జిల్లా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల జిల్లా సమన్వయకర్తగా ఉన్నాడు. గురువారం ఉదయం పల్నాడు నుండి గిద్దలూరుకు కారులో బయలుదేరాడు. గిద్దలూరుకు 7 కిలోమీటర్ల దూరంలోని రాచర్ల మండలం చెర్లోపల్లి సమీపంలో 11 గంటల సమయంలో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బి.వి.రంగారావు తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి గిద్దలూరు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. డాక్టర్ రంగారావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రంగారావును మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఆయనను పరీక్షించిన వైద్యులు ఎడమ చేయివిరగ్గా, పక్కటెముకలు కూడా కొంత విరిగినట్లు గుర్తించారు. డాక్టర్ రంగారావుకు శ్వాస తీసుకోవడంలో సమస్య ఎదురవుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం డాక్టర్ రంగారావుకు మెడికవర్ ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ రంగారావు గతంలో గిద్దలూరు, కంభం, మాచర్ల, బాపట్ల ప్రభుత్వ వైద్యశాలల్లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ప్రమాదవార్త తెలుసుకున్న వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. గిద్దలూరుకు చెందిన పలువురు శుక్రవారం కర్నూలు వెళ్ళి డాక్టర్ రంగారావును పరామర్శించారు.

పట్టపగలే మహిళ మెడలో చైన్‌ను లాక్కెళ్లిన దుండగుడు



చైన్‌ను లాగుతుండగా పెనుగులాడుతున్న యువతి

రామకృష్ణాపురం(చీరాలటౌన్), జూలై 19 : పట్టపగలే మహిళ ఒంటరిగా వెళుతుండగా గమనించిన ఓ దుండగుడు ఆమె మెడలో చైన్‌ను లాక్కెళ్లేందుకు యత్నించాడు. ఈఘటన శుక్రవారం చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల హేమసాయి లత స్వగ్రామం చీరాలలోని రామకృష్ణాపురం. అయితే తిరునాళ్ల ఉండటంతో మొక్కుబడులు చెల్లించేందుకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈక్రమంలో ఉదయం సుమారు 10 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఈమెను చూసి కిందకు దిగాడు. దర్జాగా ఒంటరిగా ఉన్న మహిళపై తెగబడి మెడలోని చైన్, నల్లపూసల బంగారు గొలుసులు అపహరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె కూడా ఎదురు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో పెనుగులాటలో చైన్ తెగింది. సుమారు 10 గ్రాముల వరకు బంగారం అపహరించి దుండగుడు పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సీసీ కెమెరా ఆధారంగా గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అపహరణకు పాల్పడిన వ్యక్తి ఎరుపు రంగు టోపీ, నలుపు రంగు ఫ్యాంటు, పచ్చ రంగు టీషర్ట్ ధరించి ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు.

వీడని వర్షం ... ఆగిన మగ్గం

పేరుకు పోతున్న నిల్వలు
పట్టించుకోని అధికారులు



పని ఆగిపోవడంతో ఖాళీగా ఉంచిన మగ్గం

చీరాల, జూలై 19 : వారం రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది. వర్షాలు కురుస్తున్నాయి. మంగు వాతావరణం ఏర్పడింది. ఇదే పరిస్థితి మరో నాలుగైలు రోజులు ఉంటుందని చెప్తున్నారు. దీంతో మగ్గం పని ఆగుతోంది. రోజువారీ మజూరీ(కూలీతో) బతుకుబండిని నెట్టుకొచ్చే తమకు ఈ పరిస్థితి సంకటంగా మారిందని సగటు చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా తాత్కాలిక భృతికింద సాయం అందించాలని వారు కోరుతున్నారు. తమ వద్ద పేరుకుపోయిన వస్త్రాల కొనుగోలు నిలిచిపోవటంతో తాము కూడా పూర్తిస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మాస్టర్ వీవర్లు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాలకులు, అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమ పూర్వవైభవానికి తగిన చర్యలు చేపట్టాలని నేతన్నలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

చీరాల నియోజవకర్గంలో సుమారు 7,600 మగ్గాలు ఉన్నాయి. చేనేత వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50వేల మంది జీవనం సాగిస్తున్నారు. అందులో రెక్కడితేకాని డొక్కాడని సగటు చేనేత కార్మికులు సింహభాగం ఉన్నారు. సొంత మగ్గం ఉండి వస్త్రాలు నేసేవారికి కొంత వెసులుబాటు ఉంటుంది. షావుకార్లు(మాస్టర్ వీవర్) నుంచి ఎంట్లు(నూలు) అరువు తెచ్చుకుని నేతనేసేవారు కొందరు. వారికి పని కుంటుపడిందంటే చేయి మెసలాయింపు ఉండదు. ఈ క్రమంలో మాస్టర్ వీవర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందే. వరుసగా పనిఆగితే ఎంత ఆర్థికపరిపుష్టి ఉన్నా మాస్టర్ వీవరయినా పెట్టుబడులు పెట్టటం సాధ్యం కాదు. వారికి కూడా తలకు మించిన భారం అవుతుంది.

గత ప్రభుత్వంలో నెలకొన్న పరిస్థితులతో చేనేత వస్త్ర నిల్వలు భారీగా పేరుకుపోయాయి. దీంతో మాస్టర్ వీవర్లు అదనపు పెట్టుబడుల కోసం ఇబ్బంది పడుతున్నారు. తమ దగ్గర పేరుకుపోయిన వస్త్రాలను వెంటనే కొనుగోలు చేయించాలని కోరుతున్నారు. ప్రాథమికంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేయించి, వెంటనే డబ్బు చెల్లించేవిధంగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. లేదంటే పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

పాపం గత ప్రభుత్వానిదైనా అది ప్రస్తుత ప్రభుత్వానికి శాపంగా మారింది. ఈ క్రమంలో ప్రాథమికంగా పేరుకుపోయిన నిల్వలను కొనుగోలుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. చేనేతతో పాటు చేనేత ఉపవృత్తులపై ఆధారపడి జీవించేవారిని పరిగణనలోకి తీసుకోవాలి. బోగస్ చేనేత సహకార సంఘాలకు చెక్ చెప్పాలి. ఎక్కడ శ్రమ దోపిడీకి గురవుతుందో గుర్తించాలి. ప్రభుత్వపరంగా అందే రాయితీలు నిజమైన లబ్ధిదారులకు అందుతున్నాయా ..? దారి మళ్లుతున్నాయా అనే విషయంపై క్షేత్రస్థాయిలో దృష్టి సారించాలి. చేనేతకు పవర్ లూమ్ శాపంగా మారిందనటంలో సందేహం లేదు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు పరచాలి. ఆ క్రమంలో ప్రభుత్వం ఆదుకునేందుకు మార్గం సుగమం చేయాలి

అలంకారప్రాయంగా క్లస్టర్లు

చీరాల నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో చేనేత క్లస్టర్లను నిర్మించారు. అయితే అవి ప్రారంభానికి నోచుకోక అలంకార ప్రాయంగా ఉన్నాయి. ఈ క్రమంలో పాలకులు, అధికారులు స్పందించి వెంటనే ఆ క్లస్టర్లును ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి. ఆ దిశగా పాలకులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

మండల సర్వసభ్య సమావేశంలో
వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

కారంచేడు(పర్చూరు), జూలై 19: నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాడరేవు - పిడుగురాళ్ళ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పొలాలకు చెందిన రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, సభ్యులు కోరారు. శుక్రవారం కారంచేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీరు కట్టు వాసుబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. తొలుత నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వం హయాలో తొలిసమావేశం కావటంతో పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుతోపాటు, ప్రభుత్వానికి అభినందలు తెలిపారు. గ్రామాభివృద్ధికి, మండల పరిషత్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ సుబ్బారావు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పంట కాలువలు, పలక కాలువలు, డ్రైనేజ్ వద్ద అవసమైన వంతెన నిర్మాణాలు లేకుండా రహదారిని ఏర్పాట్లు సాగుతున్నాయన్నారు. ఇలా డ్రైనేజ్ నిర్మాణం లేకుండా జాతీయ రహదారి నిర్మాణం చేపడితే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బాబూరావు, ఐనంపూడి వనజ, ముల్లానూర్ అహ్మద్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డీఎండీ రాయపాటి మమత,లాయిడ్ ఫార్మాఎండీ విక్రమ్ నారాయణ తదితరులు

రేపు చినగంజాంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- ఆస్టర్ రమేష్‌హాస్పిటల్ డీఎండీ మమత
- ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో నిర్వహణ

మార్టూరు, జూలై 19:గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించే ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సేవాగుణమే తమకు నియోజకవర్గంలో హాస్పిటల్ బ్రాంచ్ ఏర్పాటుచేయాలనే ఆలోచన వచ్చిందని, త్వరలోనే బ్రాంచ్ ఏర్పాటుచేస్తామని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రాయపాటి మమత అన్నారు. శుక్రవారం మండలంలోని ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎండీ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో నియోజకవర్గంలో మూడోసారి వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నామన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాంలో ఈనెల 21 ఆదివారం జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు ఐదురకాల వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా కార్డియాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, ఆర్థోపెడిక్,జనరల్ మెడిసిన్ తదితర విభాగాలలో ప్రముఖ వైద్యులతో పాటు 180 మంది వైద్య సిబ్బందితో సేవలను అందిస్తున్నామన్నారు. హాస్పిటల్ ఎండీ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సూచనల మేరకు కొన్ని గ్రామాలను దత్తతతీసుకొని ఆగ్రామాలలో అత్యాధునికమైన వైద్య సేవలను అందిస్తామన్నారు. పారిశ్రామికవేత్త లాయిడ్ ఫార్మా ఎండీ విక్రమ్ నారాయణ మాట్లాడుతూ రమేష్ హాస్పిటల్ నియోజకవర్గంలో వైద్య సేవలను అందించడానికి రావడానికి ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గంలో ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలే కారణమన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కార్తీక్, హాస్పిటల్ కో ఆర్డినేటరు భరత్, టీడీపీ చినగంజాం నాయకులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావు, తాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదైన కార్తీక్‌ను అభినందిస్తున్న చీరాల వాసులు

దేశాన్ని చుట్టివచ్చిన కార్తీక్‌కు అభినందనలు

చీరాల, జూలై 19 : మోటారు సైకిల్‌పై భారతదేశాన్ని నెల్లూరుకు చెందిన తుపిలి కార్తీక్ చుట్టి వచ్చారు. ఆ క్రమంలో అతని పేరు గిన్నిస్ రికార్డ్స్‌లో నమోదయ్యింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి చీరాల వచ్చిన కార్తీక్‌ను ఆయన అభిమానులు స్థానిక గడియారస్తంభం సెంటర్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ తాను నెల్లూరు నుంచి 14 ఫిబ్రవరి 2022లో దేశ పర్యటన ప్రారంభించి 6 అక్టోబర్ 2023లో ముగించానన్నారు. రోజుకు సుమారు 300 కిలోమీటర్లు తిరిగానని, ఆ క్రమంలో సంస్కృతి. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక స్థలాలు, సందర్శనీయ ప్రదేశాలను చుట్టివచ్చానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన పేరు గిన్నిస్ రికార్డ్స్‌లో నమోదయినట్లు తాజాగా తనకు అందిన వర్తమానాన్ని చూపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమయూన్ కబీర్, కౌన్సిలర్ దాసరి శ్రీనివాసులు, షేక్ సుభాని, సుబ్రమణ్యం, మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.


శ్రీశైలం బయలుదేరిన సోపిరాల టీడీపీ నాయకులు

శ్రీశైలంలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు

చినగంజాం, జూలై 19 : 2024 సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ కూటమి అత్యధిక మెజార్టీ సాధించడం, పర్చూరు శాసనసభ్యులుగా ఏలూరి సాంబశివరావు విజయం సాధించడంతో సోపిరాల టీడీపీ నాయకులు శ్రీశైలంలో శుక్రవారం రాత్రి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అయిన సందర్భంగా, ఎమ్మెల్యే ఏలూరి హాట్రిక్ విజయం సాధించడంతో శ్రీశైలంలోని మల్లికార్జునస్వామి వద్ద మొక్కులు చెల్లించినట్లు నాయకులు తెలిపారు. సోపిరాల గ్రామ టీడీపీ నాయకులు తుమ్మలపెంట జయరావు, నందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, నరహరి శ్రీనివాసరావు, గంటా నరసింహారావు, సిద్దం పాపారావు, గంటా అంకమ్మలు మొక్కులు తీర్చుకున్నారు.


రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేఏసీ కన్వీనర్ నాగరాజు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బీసీ నేతలు

పర్చూరు, జూలై 19: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు ఆధ్వర్యంలో పలువురు బీసీ నేతలు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ అధికార ప్రతినిధి నల్లగాటి మల్లిఖార్జున నాయుడు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఏలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చీరాలటౌన్, జూలై 19 : చీరాల మండల పరిధిలోని ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చీరాల డివిజన్ పంచాయతీ అధికారి దారా హనుమంతురావు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో సచివాలయ, ఆరోగ్య, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నీటి తొట్టెలు, సైడ్ కాలువల్లో పూడికలు, మంచినీటి చెరువులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అలాగే బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఆయిల్ బాల్స్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే చెత్త సేకరణపై సెక్రటరీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. చెత్తను చెత్త సంపద కేంద్రాలకు మాత్రమే తరలించాలన్నారు. కేంద్రాల పరిసరాల్లో మొక్కలు పెంచాలని సూచించారు.

వాగును కమ్మేసిన చిల్లచెట్లు

ముందుకు కదలని నీటి ప్రవాహం

కొద్దిపాటి వరద వచ్చినా పంట పొలాలు ముంపు

అభివృద్ధి చేయాలని కోరుతున్న రైతులు


చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో ముందుకు కదలని నీరు

పర్చూరు, జూలై 19: ముళ్ళపొదలు, చిల్లచెట్లతో అడవిని తలపించేలా పర్చూరు డ్రైనేజ్ వాగు ఉంది. దీంతో నీరు ముందుకు కదలని పరిస్థితి. కొద్దిపాటి వరదలు వచ్చినా వాగు సమీపంలోని వందలాది ఎకరాల పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఏళ్లతరబడి చిల్లచెట్లు పెరిగిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాగుల అభివృద్ధి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో పర్చూరు వాగు పరిస్థితి అధ్వానంగా మారింది. నీరు ముందుకు కదలని విధంగా తయారైంది. గత ఏడాది వచ్చిన వరదల కారణంగా వాగు పరివాహక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లోని పంట పొలాలు ముంపునకు గురికావటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు పర్చూరు పరిసర గ్రామాల్లో అనేక మంచినీటి చెరువులు పర్చూరు వాగు ద్వారా నింపుకోవాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వాగులో చిల్లచెట్లు ముళ్ళ పొదలతో నిండిపోయి అధ్వానంగా మారింది. ఇదే వాగులోని నీటిని ఆయా గ్రామాల ప్రజలు మంచినీటి అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంది. వాగును అభివృద్ధి చేయాలని అనేకమార్లు రైతులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాగులో పెరిగిపోయిన ముళ్ల చెట్లను తొలగించటంతోపాటు వాగును అభివృద్ధి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


అడవిని తలపిస్తున్న పర్చూరు వాగు

ధరల నియంత్రణకే ప్రత్యేక కౌంటర్లు

ఇంకొల్లు,జూలై 19 : బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించేందుకే ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సరసమైన ధరలకే కందిపప్పు,బియ్యం అమ్మకాలు నిర్వహిస్తుందని టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు అన్నారు. స్థానికటీడీపీ కార్యాలయం పక్కన ప్రభుత్వ స్టోరును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180లు, బీపీటీ బియ్యం రూ.55.85పైలు ఉండగా ఈ స్టోర్‌లో కేజీ కందిపప్పు కేవలం రూ.160లు, బియ్యం రూ.49లకే అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ప్రమీల, రాష్ట్ర వాణిజ్యవిభాగ ప్రధానకార్యదర్శి పాలేరు రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ గుంజి వెంకట్రావు, టౌన్ ప్రెసిడెంట్ వలేరు మార్క్, కరి శ్రీనివాసరావు, శివయ్య, జరుగుల శ్రీను, బండ్ల శ్రీను, రాజేష్ స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఇంకొల్లులో ప్రభుత్వస్టోర్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కొండయ్య


తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 19 : ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కేంద్రాలలో తక్కువ ధరకు బియ్యం, కందిప్పు విక్రయిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక గడియారస్తంభం సెంటర్లో శుక్రవారం మిల్లర్ల సహకారంతో ఏర్పాటు చేసిన తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయించే కేంద్రాన్ని ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, దేశవాళీ కందిపప్పు కిలో రూ.160కు విక్రయిస్తారన్నారు. కొనుగోలుదారులు తమ ఆధార్‌కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వేటపాలెం తహసీల్దార్ కృష్ణకాంత్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పౌరుల చేతిలో అస్త్రం

అద్దంకిటౌన్, జూలై 19: సమాచార హక్కు చట్టం అనేది పౌరుల చేతిలో ఉన్న అస్త్రం లాంటిది అని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి సమాచారాన్ని పొందే హక్కును ఈ చట్టం కల్పిస్తుందని ప్రముఖ న్యాయవాది బత్తుల రామకోటయ్య అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో అధికారులు, సిబ్బంది, ప్రజలకు అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది రామకోటయ్య మాట్లాడుతూ సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో ఇవ్వాలని, లేని పక్షంలో పైఅధికారులకు ఫిర్యాదు చేయవచ్చుఅన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి. గంగాధరరావు, డీటీ సుధారాణి, పీఆర్ ఏఈ ఎల్. వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారిణి దీప్తి, వెలుగు ఏపీఎం కోటేశ్వరరావు, ఏపీవో గాయత్రి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టెక్నికల్ ఏవో మేరమ్మ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరులో

పంగులూరు :పంగులూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహనా కార్యక్రమం జరుగుతుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.

చినగంజాంలో..

చినగంజాం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కే.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు మండల స్థాయి అధికారులు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

మార్టూరులో..



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది బత్తుల రామకోటయ్య

మార్టూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం - 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

చెరుకూరు(పర్చూరు),జూలై 19: ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా డయేరియా వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని డాక్టర్ మైత్రేయి అన్నారు.కుష్ఠు సర్వే, డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందితో ఇంటింటా సర్వే చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మైత్రేయి మాట్లాడుతూ కుష్ఠును తొలిదశలో గుర్తించి తగిన చికిత్స నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. చిన్నారులకు కొద్దిపాటి వాంతులు అయిన దగ్గరలో ఉండే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తగిన వైద్యం పొందాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గౌతమ్, సూపర్‌వైజర్ డి.బాబు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


చెరుకూరు గ్రామంలో డయేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చినగంజాంలో ర్యాలీ

చినగంజాం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చినగంజాం గ్రామంలో, సంతరావూరు పీహెచ్‌సీ పరిధిలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతిసార నివారణపై శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, శుద్ధి జలాలు వినియెగించడం ద్వారా డయేరియాను నివారించవచ్చునని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తిలు అన్నారు. డయేరియాపై ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. చినగంజాం గ్రామ ప్రధాన వీధులలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అతిసార వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, వ్యాధి నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, ఎంఈవో బి.అజయ్‌బాబు, వైద్యాధికారులు ఎస్. విజయభాస్కరరావు, బి.నాగేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.వాణిశ్రీ, గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


చినగంజాంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

ఇంకొల్లులో

ఇంకొల్లు : వర్షాకాలంలో సీజనల్‌గా సోకే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంకొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అంజలి అన్నారు.శుక్రవారం మండలంలోని అంకిరెడ్డిపాలెం, ఇడుపులపాడు గ్రామాలలో ఇంటింటా తిరిగి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.జ్వరాలతో బాధపడేవారు ఏఎన్ఎంలను సంప్రదించి రక్త. పరీక్షలు చేయించుకొని మలేరియా,డయోరియాలకు చికిత్స పొందవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కోటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరులో

యద్దనపూడి, (మార్టూరు) : గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టరు శ్రీహర్ష అన్నారు.శుక్రవారం యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో ఫిక్స్‌డ్ డే ప్రోగ్రాం లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ ప్రజల ఆరోగ్యంపై విచారణ చేశారు. ఈసందర్భంగా నీటి కలుషితవ్యాధులైన కలరా, టైఫాయిడ్, విరోచనాలు, పచ్చకామెర్లు లాంటి వ్యాధులు రాకుండా ప్రజలు పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు.అదే విదంగా వారానికి మించి నిల్వఉన్న నీటిని తాగరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో టి. శివ ప్రసాద్, ఎస్‌కె షర్మిల, కె. శివనాగరాణి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధురాలి ఆరోగ్యం గురించి విచారిస్తున్న వైద్యాధికారి శ్రీహర్ష

శాకాంబరీ దేవిగా అమ్మవారు


వివిధ రకాల కూరగాయలతో దుర్గాదేవికి అలంకరణ

కారంచేడు(పర్చూరు), జూలై 19: శాకాంబరీ దేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కారంచేడు గ్రామంలోని వైష్ణవీ దుర్గా మాత ఆలయంలో అమ్మవారు శాకాంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రక రకాల కూరగాయలు పండ్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాబు వద్ద జగన్ ఆటలు సాగవు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, జూలై19: సీఎం చంద్రబాబు నాయుడు వద్ద జగన్ ఆటలు సాగవని తెలుసుకోవాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే దానిని ప్రభుత్వానికి ఆపాదిస్తారా అని గొట్టిపాటి రవికుమార్ శు క్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వివాదాన్ని రెచ్చగొట్టేందుకు వైసీపీ అధినేత జగన్ వినుకొండలో పర్యటిస్తున్నారన్నారు. హత్యా రాజకీయాలకు పేటెంట్ వైసీపీదే అని విమర్శించారు. నిందితులు ఎవరైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు.

ఈపూరుపాలెంలో టాస్క్‌ఫోర్స్ సభ్యుల పర్యటన


ఈపూరుపాలెంలో పర్యటిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 19 : చీరాల మండలం ఈపూరుపాలెం సబ్ స్టేషన్- 3 పరిధిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే స్టేషన్‌లో ఉన్న రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రతినిధులు మాట్లాడుతూ గర్భిణుల స్థితిగతులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు లక్ష్మణ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గర్భిణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి

మార్టూరు, జూలై19: క్రమశిక్షణతో విద్యార్థులకు ఉత్తమ విలువలతో కూడిన చదువును అందించాలని గుంటూరు ఆర్‌జేడీ బి. లింగేశ్వరరెడ్డి ప్రధానోపాధ్యాయులను కోరారు.శుక్రవారం మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్లో చీరాల డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు హాజరుకాగా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎం. నిర్మల అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆర్‌జేడీ విద్యార్థుల విద్యకు సంబంధించి వివిధ పరీక్షలు, అత్యున్నత ప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధానాలపై పలు సూచనలు చేశారు.అనంతరం ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఎంపికకు కారణమయిన ఉపాధ్యాయులను ఆర్‌జేడీ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా రాజరాజేశ్వరి అమ్మవారి తిరునాళ్ల

చీరాల, జూలై 19 : మండల పరిధిలోని రామకృష్ణాపురంలో శుక్రవారం బొడ్డురాయి రాజరాజేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన సభ

పంగులూరు, జూలై 19 : గడిచిన విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 550కి పైగా మార్కులతో పాటు ట్రిబుల్ ఐటీలో సీటు పొందిన విద్యార్థులు, ఎన్.ఎం.ఎం.ఎస్ పోటీ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థుల అభినందన సభ పంగులూరు ఉన్నత పాఠశాలలో శనివారం జరుగుతుందని యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బి.సుబ్బారావు, నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయా పరీక్షలలో ప్రతిభ చాటిన విద్యార్థులు హాజరుకావాలని వారు కోరారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 19: స్థానిక వెంకయ్య ఆశ్రమంలో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి కంటి వైద్యులు కొర్రపాటి సుబ్రమణ్యం సతీమణి హరిప్రియ జన్మదినం సందర్భంగా పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమంలో కేక్ కట్‌చేయడంతో పాటు వారికి మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు కోటేశ్వరరావు, సాంబశివరావు, డాక్టరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య


పొగడదండ రవికుమార్

చీరాల, జూలై 19 : ఉత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులకు తమ కళాశాలలో ఉచిత విద్య అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ చెప్పారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో కూడా 50 శాతం సీట్లు విద్యార్థులకు ఉచితంగా ఇచ్చేందుకు కళాశాల యాజమాన్య ప్రతినిధి, యలమంచిలి గ్రూప్స్ సీఈవో యలమంచిలి రామకృష్ణ నిర్ణయాలను వివరించారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విత్తనం నాటే ప్రక్రియ వాయిదా వేసుకోండి

పంగులూరు, జూలై 19 : అల్ప పీడనం కారణంగా రైతాంగం పంట పొలాలలో విత్తనం నాటే ప్రక్రియ వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వెంబడి పయనిస్తున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపిందన్నారు. ఈ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఖరీఫ్ విత్తన సాగు ప్రక్రియ కొద్దిరోజులు వాయిదా వేసుకోవాలని సుబ్బారెడ్డి కోరారు.

బొడ్డువానిపాలెంలో పట్ట పగలే దొంగతనం

మేదరమెట్ల, జూలై 19: మండలంలోని బొడ్డువానిపాలెంలో పట్ట పగలే దొంగతనం జరిగింది. శుక్రవారం ఉదయం11 గంటల సమయంలో మేదరమెట్లలో ప్రైవేట్ అనుపత్రిలో నర్సుగా పని చేసే మహిళ ఇంటిలో దొంగలు ప్రవేశించారు. తలుపుగడి తీసి బీరువా పగులగొట్టి అందులో ఉన్న 5 సవర్ల బంగారు, రూ. 60 వేలు నగదు అపహరించినట్లు బాధితురాలు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని వారు పరిశీలించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 20 జూలై 2024



కమిషనర్ సంతకాల ఫోర్జరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 19: ఎస్ఎంసీ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన ఘటనపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శుక్రవారం నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎస్ఎంసీలో కమిషనర్ సంతకాన్ని కొందరు ఫోర్జరీ చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో మేయర్ భర్త జయవర్ధన్, అసిస్టెంట్ శివకృష్ణ, మరికొందరు భాగస్వామ్యులంటూ విమర్శలు వచ్చాయి. దీంతో సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని గత కమిషనర్ వికాస్‌మర్మత్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, భక్తులు





బారాషహీద్ దర్గాలో భక్తులు





ఫకీర్ల గీతాలాపన



సంక్షేమ, అభివృద్ధి రొట్టె అందుకుంటున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు



దర్గాలో అమరుల సమాధులకు గంధంతో లేపనం చేస్తున్న కడప పీఠాధిపతి ఆరీఫుల్లా తదితరులు

అందరి కోరికలు నెరవేరాలి
రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి!

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష
- వర్చువల్ విధానంలో భక్తులతో మాట్లాడిన సీఎం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 19 : 'ఎంతో విశిష్టత కలిగిన రొట్టెల పండుగకు వచ్చి రొట్టెలు అందుకున్న ప్రతి ఒక్కరి కోరికలు నెరవేరాలి. అలాగే రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి.' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిం చారు. పండుగకు విచ్చేసిన భక్తులతో వర్చువల్ విధానంలో చంద్రబాబు శుక్రవారం అమరావతి నుంచి మాటామంతీ జరిపారు. భక్తుల విశ్వాసాన్ని అడిగి తెలుసు కోవడంతో పాటు ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా భక్తులను ద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. దేవుడిపై నమ్మకంతో ప్రపంచం నడుస్తోందని, ఆ నమ్మకాలను, ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించా లని అన్నారు. రాష్ట్రానికి మంచి జరిగేలా పండుగకు వచ్చిన భక్తులు ప్రార్థించాలని సీఎం కోరారు. రాష్ట్ర ఖజానా నిండేలా దేవుడిని ప్రార్థిస్తూ రొట్టెలు మార్చు కోవాలని కోరారు. భవిష్యత్తులో రొట్టెల పండుగను ఇంటర్నేషనల్ ఫెస్టి వల్‌గా నిర్వహించేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారా యణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే లు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సేదు మాధవన్, కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, టీడీపీ నేతలు అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షిస్తూ ముస్లింల ఆనందం

రూ.5 కోట్లు కేటాయిస్తే మరింత అభివృద్ధి

రొట్టెల పండుగకు 2014లో 4 లక్షల మంది భక్తులు వస్తే ఆ సంఖ్య 2019కు 20 లక్షలకు చేరుకుంది. దర్గా ప్రాంగణాన్ని ఎంతో అభివృద్ధి చేశాము. అయితే కొన్ని పనులు ఇంకా చేయాల్సి ఉంది. రూ.5 కోట్లు కేటాయిస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తాము.

- పొంగూరు నారాయణ, రాష్ట్ర మంత్రి

ఏర్పాట్లు చాలా చక్కగా ఉన్నాయి



మూడేళ్లుగా మేము రొట్టెల పండుగకు వస్తున్నాము. ఆరోగ్యం, గృహం, ఇలా అనేక రొట్టెలు పట్టుకున్నాము. మొదటి సంవత్సరం కోరుకున్న కోరికలు నెరవేరడంతో అప్పటినుంచి వస్తున్నాము. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఏర్పాట్లు బాగున్నాయి.

- షేక్ రెహామున్నీసా, విజయవాడ

ఏర్పాట్లు బాగున్నాయి!



రెండేళ్లుగా రొట్టెల పండుగకు వస్తున్నాము. గతంలో కంటే ఈ ఏడాది ఏర్పాట్లు ఎంతో బాగున్నాయి. మేము ముందుగానే అనుకున్నాము బాబు వచ్చాడుగా ఏర్పాట్లు బాగుంటాయని. రాబోయే రోజుల్లో మరిన్ని ఏర్పాట్లు చేస్తారన్న నమ్మకం మాకుంది.

- విజయకుమారి, విజయవాడ

జడివానలోనూ
తరగని విశ్వాసం





స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఇసుక వేస్తే రాలనంతగా తరలివచ్చిన భక్తులు

- భక్తజనసంద్రంగా బారాషహీద్ దర్గా
- భక్తులతో కిక్కిరిసిపోయిన స్వర్ణాల చెరువు
- వేడుకగా గంధమహోత్సవం
- పాల్గొన్న కడప పీఠాధిపతి
- రొట్టెలు పట్టుకున్న ప్రముఖులు



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 : నేల ఈనిందా... ఆకాశానికి చిల్లుపడిందా!? అన్న రీతిలో నెల్లూరు నగరానికి భక్తజనం పోటెత్తింది. దేశం నలుమూలల నుంచి రొట్టెల పండుగకు యాత్రికులు తరలిరావడంతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. ఓ వైపు గురువారం సాయంత్రం నుంచే జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయని భక్తులు దర్గా ప్రాంగణంలోనే ఉండిపోయారు. కాగా, పండుగలో ప్రధాన ఘట్టం గంధమహోత్సవం గురువారం అర్ధరాత్రి తర్వాత వేడుకగా జరిగింది. కోటమిట్టలోని అమీనియా మసీదులో 12 బిందెల్లో గంధం కలిపి ప్రత్యేక పూలరథంలో ఊరేగింపుగా బారాషహీద్ దర్గాకు తీసుకువచ్చారు. అక్కడ గంధపు బిందెలను ఉంచి బారాషహీద్‌ల వీరగాథలను కొనియాడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా (అమీన్ పీర్) అమరవీరుల సమాధులకు గంధం పూశారు. తదుపరి దువా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రొట్టెల పండుగ ప్రారంభమైంది. జడివానలోనూ చెదరని భక్తివిశ్వాసంతో స్వర్ణాల చెరువులో కోరికల రొట్టెలను ఇచ్చి, పుచ్చుకున్నారు. ఆ తర్వాత బారాషహీదులను దర్శించుకొని పూజలు చేశారు. కాగా, పండుగలో ఇప్పటివరకు (3 రోజులు) సుమారు ఆరు లక్షల మందికిపైగా భక్తులు పాల్గొని ఉంటారని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. తరలివచ్చిన భక్తులకు అన్ని శాఖల అధికారులు విస్తృత సేవలు అందిస్తున్నారు. రాత్రి స్వర్ణాల చెరువులో రాష్ట్ర మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి, శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు అభివృద్ధి, సంక్షేమ రొట్టెలను అందుకున్నారు. కాగా, దర్గా ప్రాంగణంలో కొంతమంది పోలీసుల తీరుపై మీడియా ప్రతినిధులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే వీవీఐపీ పాసులు ఉన్న వారిని, అధికార పార్టీ నాయకులనూ పోలీసులు అడ్డుకోవడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వీక్షించేందుకు దర్గాలో పలుచోట్ల ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అయితే వాటిలో సగానికిపైగా పనిచేయక పోవడంతో భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది.



బారాషహీద్ దర్గా దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



తెలుగు కవిత్వంలో
నిలువెత్తు సంతకం

అడిగోపుల వెంకటరత్నంకు నివాళి

తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితిని మిగిల్చి ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో కన్ను మూశారు. దళిత స్పృహ, అభ్యుదయ భావజాలంతో యాభై ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా కవిత్వం రాశారు. ఆయన కవిత్వం అచ్చుకాని పత్రిక ఏదీ తెలుగు నేలమీద లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పరిణామాన్నీ నిశితంగా గమనిస్తూ కవిత్వ రూపంలో స్పందించడం ఆయన ప్రత్యేకత.

- కోవూరు/తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు అడిగోపుల వెంకటరత్నం పుట్టిన ఊరు. నాగార్జున యూనివర్సిటీలో ఇంజనీరుగా చేస్తూనే కవిత్వం విరివిగా రాసేవారు. రిటైరయ్యాక తిరుపతిలో స్థిరపడ్డారు. భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు. విదేశాల్లో ఉన్న కుటుంబసభ్యులు వచ్చాక ఆయన చివరి కోరిక ప్రకారం స్వస్థలం కొత్తవంగల్లులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.


"నిన్నటి మొన్నటి జ్ఞాపకం.. వర్తమానంలో ఉంటుంది.. నేటి జ్ఞాపకం, రేపటి జ్ఞాపకం.. భవిష్యత్తులో ఉంటుంది... నా అంటరానితనం దూరంగా కూర్చొన్న జ్ఞాప కం.. ఇది గతం. రేపు నేను మరణించాక అంటరానితనం వెంటబడి ఊరిదారి అనుమతించక ఊరిబయటే ఉం టుంది... నా శవప్రస్థానం... నా రేపటి జ్ఞాపకం కాకూడదు." అని తన కవిత్వంలో విస్పష్టంగా ప్రకటించిన కవి అడిగోపుల వెంకటరత్నం. "మల్లెచెట్టు కింద మల్లెతీగలం ..ఎదు గూ బొదుగూ లేని వాళ్ళం.." అంటూ తెలుగు కవిత్వంలో దళిత జీవితంలోని దైన్యాన్ని అనేక దశాబ్దాల క్రితమే వినిపించిన కవి ఈయన. ఆరుద్ర, ఆత్రేయ, రావూరి భరద్వాజ, సినారె, రాచపాళెం, సంజీవ్‌దేవ్, గుంటూరు శేషేంద్రశర్మ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, రావిశాస్త్రి, వంటి ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కవి అడిగోపుల వెంకటరత్నం. కుమారుడు శ్రీకాంత్ చిత్రకారుడుగా గుర్తిం పు పొందారు. అడిగోపుల కవితా సంపుటాలకు కుమారుడు రూ పొం దించిన చిత్రాలనే ముఖ చిత్రాలుగా ముద్రిం చుకున్నారు. అడిగోపుల కవిత్వంపై వేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎస్. భీమన్న పరిశోధన చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పద్మకుమారి పరిశోధన చేశారు. నాగార్జున యూనివర్సిటీలో అడిగోపుల కథలపై త్రివిక్రమ సూరి ఎంఫిల్ చేశారు.

అందుకున్న అవార్డులు

కుందుర్తి పురస్కారం, శ్రీశ్రీ అవార్డు, తానా అవార్డు, కరుణశ్రీ అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవార్డు,తెలుగు వర్సిటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ కవిరత్న అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, గిడుగు పురస్కారం , నూతలపాటి కవి తా పురస్కారం, కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉమ్మడిశెట్టి పురస్కారం, గార్లపాటి సిద్దమనాయుడు పురస్కారం, విశాలాక్షి సాహిత్య పురస్కారం.


అడిగోపుల కవితా సంపుటాలు

సూర్యోదయం, ఎన్నాళ్ళీ చరిత్ర, పురోగతి అంచున, జీవన పోరాటం, బానిసత్వం అమ్మబడును, మరణానికి రెండు ముఖాలు, విప్లవానికి పురిటిగది , ఆకాశవీధిలో అగ్నిగానం, యుద్ధమంటే మాకు భయం లేదు, మట్టి మౌనం వహించదు , మహాపథం, రాతి చిగుళ్ళు, అదృశ్యకుడ్యం, సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు, శ్వేతపత్రం, విశ్వ గీతం, రంగుల చీకటి, రేపటి వర్తమానం, రెక్కవిప్పిన రాగం, రేపటి జ్ఞాపకం, ముందడుగు, పదండి ముందుకు, కాలం నా చేతిలో ఉంది, జయభేరి, కొత్తగాలి, నిలువెత్తు సంతకం.



వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కర్‌రావు



వెంకటాచలం, జూలై 19 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఉపకులపతి (వీసీ) డాక్టర్ సారంగం విజయభాస్కర్ రావు స్పష్టం చేశారు. వర్సిటీలోని పరిపాలన భవనంలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కే సునీత, వర్సిటీ అధికారులు, సిబ్బంది విజయభాస్కరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వర్సిటీలోని అన్ని శాఖలు, తరగతి గదులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. అందరం కలిసికట్టుగా కృషి చేస్తూ విద్యార్థులకు చక్కటి సదుపాయాలతో కూడిన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు.

ఊపందుకున్న వరినాట్లు


సంగసానిపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు

సీతారామపురం, జూలై 19: మూడురోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో మండలంలో వ్యవసాయ బోర్ల కింద రైతులు ఖరీఫ్ వరినాట్లు వేయడం ప్రారంభించారు. సీతారామపురం, సింగారెడ్డిపల్లి, మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి బసినేనిపల్లి, అయ్యవారిపల్లి ,రంగనాయుడుపల్లి గ్రామాల్లో వరినాట్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో వారంరోజుల్లో అన్ని గ్రామాల్లో నాట్లు ముమ్మరంగా సాగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరలేదు.

వరుస పద్ధతితో అధిక దిగుబడులు : ఏవో

వరుస పద్ధతిల్లో వరినాట్లు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారెడ్డి తెలిపారు. కుదురు కుదురు మధ్య 10సెంటీ మీటర్లు, లైన్.. లైన్‌కి మధ్య 20సెంటి మీటర్ల దూరం ఉండేలా నాట్లు వేసుకోవాలని ప్రతిరెండు మీటర్లకు కాలి బాట వదులు కోవాలన్నారు. ఇలా చేస్తే ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఇలా చేయడం వలన పంటకు సూర్యరశ్మి తగిలి, దోమ, చీడపీడలు ఆశించవని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న కొండకిందపల్లి గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, జూలై 19: అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఘాట్‌రోడ్డు సాధన సమితి సభ్యులు సీపీఎంల ఆధ్వర్యంలో శుక్రవారం బండగానిపల్లిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. అటవీ అనుమతులు లేని 3.2కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లు చెప్పారు. దశాబ్దాల తరబడి పది గ్రామాల్లోని 16వేల మంది జనాభా రాకపోకలు సాగించే ఈ ఘాట్‌రోడ్డు అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని వాపోయారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ నా యబ్, భేరి తిరుపాలురెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


జమ్మవరంలో అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఏఎస్ పేట, జూలై 19: జమ్మవరం ఎస్టీ కాలనీలో శుక్రవారం బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి కేంద్రం అందించే ఉజ్వల ఉచిత గ్యాస్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులులేని వారిని గుర్తించారు. వారికి త్వరలో అందేలా చూస్తామన్నారు. కాలనీలో ప్రధానంగా శాశ్వత ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వర్షం కురిస్తే గుడిసెల్లోకి నీరు చేరి అవస్థలు పడుతున్నారని ఇల్లులేని వారికి శాశ్వత ఇళ్లు కట్టించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చెంచుల రెడ్డి, ఉపాధ్యక్షుడు గునుపూడి శ్రీనివాస్, పెంట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెదబ్బీపురంలో అక్రమ కట్టడాల తొలగింపు

ఏఎస్ పేట, జూలై 19: ప్రభుత్వ స్థలాలలను ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని ఏఎస్‌పేట తహసీల్దారు రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పెదబ్బీపురం ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగింపజేశారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 10న ఆయనకు నోటీసులు జారీ చేసినా నిర్మాణం కొనసాగిస్తుండడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్మాణలను తొలగించామన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణలు చేడితే చర్యలు తప్పవన్నారు.

వైభవంగా శేషవాహన సేవ


శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

సంగం, జూలై 19: మర్రిపాడులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి శేషవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గజ పూలమాలలతో అలంకరించారు. అనంతరం విద్యుత్‌దీపాలంకరణ, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి రామాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వనమా సుబ్రహ్మణ్యం శ్రేష్ఠి ఉభయకర్తలుగా వ్యవహరించారు.ఈవో పెంచల వరప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్: ఆషాఢమాసం రెండో శుక్రవారం సందర్భంగా బీసీకాలనీలోని సంతానలక్ష్మికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు లోకా వెంకటప్రసాద్‌శర్మ అమ్మవారిని విశేష కుంకుమ అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు


ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్

ఉదయగిరి, జూలై 19: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వార్డులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు, మందులు, వివిధ రకాల వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయగిరి వైద్యశాలల్లో చిన్నపిల్లల జనరల్ సర్జన్ వైద్యులు నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. డీడీవో అనీషా, ఠాగూర్, షంషుద్దీన్, శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

రోగులకు ఆహార పొట్లాల పంపిణీ

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉదయగిరి చారిటబుల్‌ట్రస్టు సభ్యులు రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ప్రతివారం రోగులకు ఆహారం అందజేస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, డీడీవో అనిషా, వైద్యులు ఠాగూర్, నిర్వాహకులు అల్‌హజ్‌బాషా, అక్బర్‌అలీ, షఫీ, అబీద్ పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రాలు విడుదల

వింజమూరు / దుత్తలూరు (ఉదయగిరి రూరల్) జూలై 19: శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలోని గురుపౌర్ణమి ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం వింజమూరు పిరమిడ్ మాస్టర్ హేమలత, రాజేశ్వరి, కౌసల్య ఆచారి నారాయణరెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీవేదవ్యాసుడు విగ్రహ ప్రతిష్ఠాపన, స్వామీజీల సందేశాలు, మధ్యాహ్నం ధ్యాన ప్రసాదం, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం శ్రీవేదవేస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ధ్యాన సాధన మహాశక్తి సజ్జన సాంగత్యం, ఆచార్య సంగీతం మధ్యాహ్నం ధ్యాన ప్రసాదం శాకాహార ర్యాలీ జరుగుతుందన్నారు. ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో ప్రచారం చేసి అందర్నీ ఆహ్వానించామన్నారు. కార్యక్రమంలో వింజమూరు నాగులు, పార్వతి, కొందరు మాస్టర్లు పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ


నెమ్మళ్లదిన్నెలో కంది విత్తనాల పంపిణీ చేస్తున్న సర్పంచి రామచంద్ర

సీతారామపురం, జూలై 19: నెమ్మళ్లదిన్నె రైతుసేవా కేంద్రంలో సబ్సిడీతో ఎల్ ఆర్‌జి-52 కంది రకం విత్తనాలను శుక్రవారం సర్పంచ్ రామచంద్ర ఆధ్వర్యంలో అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఏఏ లక్ష్మినారాయణ మాట్లాడారు. మొదటిరోజు క్వింటం కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశామన్నారు. ఆగస్టు మొదటివారం వరకు కంది పంటకు అనుకూలంగా ఉంటుందని, ఐదు ఎకరాల లోపు రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి విత్తనాలను పొందవచ్చన్నారు. కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా రొట్టెల పండుగ

ఉదయగిరి రూరల్, జూలై 19: స్థానిక పెద్ద చెరువులో శుక్రవారం రొట్టెల పండుగను భక్తులు వైభవంగా నిర్వహించారు. జోరు వర్షంలో పట్టణంతో పాటు దాసరిపల్లి, మాసాయిపేటలోని హిందూ, ముస్లింలు పాల్గొని రొట్టెలు మార్చుకున్నారు. ప్రధానంగా వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం రొట్టెలకు గిరాకీ ఏర్పడింది.

ఆర్డీవో ఏర్పాట్ల పరిశీలన



సంగం, జూలై 19: నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా బారా సాహెబ్ దర్గా దర్శనకు వచ్చే భక్తులు ఏఎస్‌పేట దర్గాకు వెళ్తూ స్నానాలు చేసి, విశ్రాంతి తీసుకునేందుకు సంగం బ్యారేజీ వద్దకు వస్తుంటారు. వీరికి రక్షణకు చేసిన ఏర్పాట్లు, సౌకర్యాలను శుక్రవారం ఆర్డీవో మధులత పరిశీలించారు. స్నానాలు, మరుగుదొడ్ల తాత్కాలిక ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

సోమశిల డ్యాం వద్ద నీటి కష్టాలు

అనంతసాగరం, జూలై 19: సోమశిల జలాశయం దిగువన పర్ణశాలల వద్ద ఉన్న కుళాయిలకు నీరు రాక పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలోని మురుగుదొడ్లకు నీరు సరఫరా లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. మహిళల అవస్థలు చేపలేనివిగా ఉన్నాయి. అధికారులు స్పందించి నీటి సరాఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట కాలువలో పూడికతీత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కాలువలో పూడికను తీయించి బ్లీచింగ్ చల్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆత్మకూరు, జూలై 19: అప్రమత్తత లేకుంటే రోగాల పాలు అనే శీర్షిక రెండురోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రామస్వామిపల్లిలో శుక్రవారం కార్యదర్శి పి.భాస్కర్ పంట కాలువలోని పూడికను తీయించి శుభ్రం చేయించారు. అనంతరం పంటకాలువ పరిసర ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించి, కాలువలో ఆయిల్ బాల్స్ వేయించారు.

వైభవంగా పీర్ల గ్రామోత్సవం

వరికుంటపాడు, జూలై 18: తోటలచెరువుపలి పీర్ల గ్రామోత్సవాన్ని భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో వర్షం కురుస్తున్నా ముందుకు సాగారు. దారిపొడవునా వారు కడ వలతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఎడతెరపి లేని ముసురు

వరికుంటపాడు, జూలై 19: మండలంలో రెండురోజులుగా మోస్తారు వర్షం కురుస్తుంది. గురువారం మధ్యాహ్నం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆపై రాత్రి తగ్గుముఖం పట్టినా శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం రోజంతా ముసురు కమ్ముకొని కురిసింది. గ్రామాల్లోని వీధులు చిత్తడిగా మారాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఉదయగిరి రూరల్: ఉదయగిరిలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వర్షంతో పాటు చలితో కూడిన ఈదురుగాలులు వీయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మోస్తారు వర్షాలు కురవకపోవడం, నీటి వనరులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అనంతసాగరం: రెండురోజుల పాటు మోస్తారు వర్షం కురిసింది. సాగులో ఉన్న వరి, మిరప, పత్తి పంటలకు కాస్త ఊరట లభించిందని రైతులు తెలిపారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

ఉయగిరి రూరల్, జూలై 19: స్థానిక బీసీకాలనీ సమీపంలోని గణేష దత్తసాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామికి కాగడహారతి, పంచామృతాభిషేకం, నిత్యపూజలు, శాంతిహోమాలు, మధ్యాహ్న, సంధ్యాహారతితో పాటు ప్రత్యేక పుష్పాలంకరణలో సాయిబాబా పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్


కాలనీలో పనులు చేయిస్తున్న ఎంపీడీవో

సీతారామపురం. జూలై 19: స్థానిక కోటవీధి, కురవ వీధితో పాటు పలు కాలనీల్లో పారిశుద్ధంపై శుక్రవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల వద్ద బీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా డయేరియా, మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నట్లు చెప్పారు. స్థానిక పంచాయతీ పరిధిలో ప్రజలకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలో భాగంగా పనులు చేపట్టామన్నారు.

నేడు ఉదయగిరి మండల సమావేశం

ఉదయగిరి, జూలై 19: మండల సమావేశం శనివారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఈశ్వరమ్మ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్త్రీశక్తి భవనంలో నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన సాలిపేట సర్పంచి చాపల రమణయ్య, కర్లపాలెం గ్రామస్థులు

గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం : ఎమ్మెల్యే ఇంటూరి

- నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరిన కర్లపాలెం వాసులు
- తెలుగుదేశం గూటికి సాలిపేట సర్పంచి రమణయ్య

కందుకూరు, జూలై 19: వైసీపీకి కంచుకోటగా ఉన్న గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ సర్పంచ్ చాపల రమణయ్య తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు పంచాయతీలోని కర్లపాలెం గ్రామానికి చెందిన 36 కుటుంబాల వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారంతా శుక్రవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి వచ్చి ఇకముందు టీడీపీలోనే తమ ప్రయాణం సాగిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇవ్వటంతో వారికి ఆయన టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చాపల రమణయ్యతో పాటు కర్లపాలెం గ్రామపెద్దలు మీరయ్య, లంకె సుబ్బారావు, చాపల శ్రీనివాసులు, తదితరులంతా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామమైన కర్లపాలెం గ్రామస్థులు పునరావాసం, భూ పరిహారం తదితర అంశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు వివరించగా సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలిపేట పంచాయతీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సర్పంచ్ చాపల రమణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విధానాలు నచ్చి టీడీపీలో చేరుతున్నామని, ఆయన ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం ఏర్పడిందని పేర్కొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

లింగసముద్రం, జూలై 19 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదల దరి చేర్చడమే ధ్యేయమని కందు కూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదపవని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఆధార్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రె పాటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో పలువురు ఎస్టీలు తమకు ఆధార్‌కార్డులు లేవని, దీనివలన తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని తన దృష్టికి తెచ్చారన్నారు. దీంతో కందుకూరు సబ్ కలెక్టర్ జి విద్యాధరితో చర్చించి ఆధార్ నమోదు సెంటర్‌ను ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. జనన ధృవీకరణ పత్రం లేని వారి నుంచి అర్జీలు స్వీకరించి, వారికి త్వరలో ఆధార్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు పలువురికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ డా. కేపీ నరసింహారావు, మాజీ సర్పంచ్ సయ్యద్ నాయబ్ రసూల్, దేవస్థానం ఛైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎమ్మెల్యేకు సత్కారం

కందుకూరు: తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న వెంగమాంబ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి ఎస్సీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అంతకుముందు చర్చి సెంటర్ నుంచి ఫంక్షన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టరు బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నేతలతో పాటు ఎస్సీ సెల్ నాయకులు చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, పులి నాగరాజు, లింగాబత్తిన మాల్యాద్రి, రెబ్బవరపు మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన రాళ్లపాడు టీడీపీ నేతలు


నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసిన రాళ్లపాడు టీడీపీ నేతలు, తెలుగు రైతు అధ్యక్షుడు రామారావు తదితరులు

లింగసముద్రం, జూలై 19: మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని రాళ్లపాడు గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలు పలువురు శుక్రవారం మండల తెలుగు రైతు అధ్యక్షుడు మద్దాల రామారావు ఆధ్వర్యంలో నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ గ్రామంలోని బీసీ కాలనీకి వాటర్ ప్లాంటు మంజూరు చేయాలని ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్టు రామారావు చెప్పారు.

టీం సేవియర్స్ సేవలు ప్రేరణ దాయకం


టీంసేవియర్స్ బృందాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, జూలై 18: టీం సేవియర్స్ సేవలు ప్రేరణ దాయకమని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు ఎన్ ప్రణీత్‌కు ఇటీవల తమిళనాడులోని ఊటిలో జాతీయ అవార్డు బహూకరించింది. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రణీత్, సంఘం బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. తాను భవిష్యత్‌లో ప్రజలకు ఉపయోగపడేలా మెగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహించతలపెట్టానని అందుకు టీంసేవియర్స్ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సిద్ధు, టీం సేవియర్స్ సభ్యులు మౌర్య, భార్గవ్, మణిదీప్, ఆకాంక్ష, కృష్ణవేణి, మేఘన, కరిష్మా, రాకేష్ పాల్గొన్నారు.

ఈ-స్టాంపును రద్దు చేయాలని ధర్నా


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితసంఘాల నేతలు

కావలి, జూలై 19: ఈ-స్టాంపులను రద్దు చేసి భారత ప్రభుత్వం విడుదల చేసే పాత స్టాంపులను ప్రజలకు అందుబాటులోకి తేవాలని దళిత సంఘ ర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ విషయంపై ధర్నా చేపట్టి ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ స్టాంపులను తీసుకవచ్చారని నాణ్యత లేని స్టాంపులపై జరిపిన లావాదేవీల పత్రాలు అనతి కాలంలోనే చిరిగిపోతున్నాయని వాపోయారు. ఆస్తుల పత్రాలు దీర్ఘకాలం దెబ్బతినకుండా ఉండేందుకు పాత స్టాంపులను టీడీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకరావాలని కోరారు. ఈ స్టాంపులతో ఎస్సీ ఎస్టీలు తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రయివేట్ బ్యాంకుల వద్ద అప్పులు తెచ్చుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కొత్త ప్రభుత్వం ఈస్టాంపులను రద్దుచేసి పాత స్టాంపులను ప్రవేశపెట్టాలన్నారు.

కందుకూరులో ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు

కందుకూరు: దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కందుకూరు కేవీకేలో శుక్రవారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో రైతులు, రైతు మహిళలు, యువ రైతుల సమక్షంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 740 కేవీకేలు రైతులకు సేవలందిస్తున్నాయని తెలిపారు. కందుకూరులో కేవీకే ప్రారంభించి పదేళ్లు అవుతోందని, ప్రస్తుతం పూర్తిస్థాయిలో శాస్త్రవేత్తల నియామకం జరగటంతో రైతులకు భవిష్యత్తులో మరింత సేవలందించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సబ్‌ప్లాన్ కింద అర్హత కలిగిన ఎస్సీ రైతులకు నీటి తడులు ఇవ్వటానికి అవసరమైన పీవీసీ పైపులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేష్, జ్యోతి, శ్రీరంగ, మాయాంక్, వివేక్, నిహారిక పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు

కలిగిరి: పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ ఉత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు వేదపండితులు పున్నవజ్జుల శేషసాయి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం పాలాభిషేకం, ప్రత్యే కపూజలు, మహిళల కోలాట ప్రదర్శన ఉంటాయన్నారు. ఆదివారం స్వామి సర్వదర్శనం, అన్నదాన కా ర్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం విశేష పుష్పా లంకరణతో గ్రామోత్సవం, చిన్నారుల కోలాటం ప్రదర్శన ఉంటాయన్నారు.

నీటి సంబంధిత వ్యాధులు రాకుండా చర్యలు

కావలి రూరల్, జూలై 19: నీటి సంబంధిత వ్యాధులు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌బాబు సూచించారు. శుక్రవారం ఆయన అముదాలదిన్నె సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి సచివాలయ ఉద్యోగి సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించేలా గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాతూరులో పారిశుధ్య పనుల పరిశీలన

కావలి, జూలై 19: పట్టణంలోని పాతూరు 4వ వార్డులో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా పనితీరును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. వర్షపు నీరు కాలనీల్లో నిల్వ ఉండకుండా డ్రైనేజీలను శుభ్రం చేయాలని వాటిని పరిశీలించారు. చెత్తా, చెదారం నిల్వలతో రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు వార్డుల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే కావలి పురపాలక సంఘం కంట్రోల్ రూంకు 08626 243706, 9963029494 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

గురుపూర్ణిమ ఉత్సవాల ప్రారంభం

కావలిటౌన్, జూలై19: గురుపూర్ణిమ మహోత్సవాలు పట్టణంలో శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసిన శ్రీసాయి క్షేత్రం, ఆర్టీసీ డిపో వెనుకనున్న నందదీప్ సాయిసమాజ్ మందిరం, పాతూరు శివాలయం పక్కనున్న సాయిబాబా మందిరాల్లో గురుపూర్ణిమ మహోత్సవాల పూజలు జరిగాయి. శ్రీసాయి క్షేత్రంలో ఉదయం కాగడ హారతి, ఓంకార ధ్వజారోహణ, బాబా వారికి ప్రత్యేక అభిషేకాలు, సహస్ర నామార్చన పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని బాబాను దర్శించుకున్నారు. శనివారం గోపూజ, తులసి పూజ, దుని పూజ, సామూహిక లక్ష మల్లెలార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు.

ధరల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం

అల్లూరు, జూలై 19: ధరలను నియంత్రించడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్టు తహసీల్దారు దుర్గేశ్వరరావు తెలిపారు. అల్లూరు రాయాజీవీధిలో శుక్రవారం ఆయన రాయితీపై విక్రయించే సరుకుల షాపును ప్రారంభించి మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయాజీవీధిలోని పీఏఎస్ ప్రొవిజన్స్ దుకాణంలో స్టాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వో రంతుల్లా, నాయకులు కృష్ణచైతన్య, బుల్లా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసుల రెడ్డి, అరగల రమణయ్య, కార్తీక్ శర్మ, మద్దిబోయిన శ్రీను, కట్టా నవీన్, వంగర రవి, ఖదీర్, నాయబ్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, జూలై 19: మండలంలోని చీమలపెంట మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను లింగసముద్రం పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఎస్‌హెచ్ఓ పి మల్లికార్జున సిబ్బందితో దాడి చేసి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్ఓ తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

బిట్రగుంట, జూలై 19: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మహిళ పోలీస్ పుష్పలత తెలిపారు. బోగోలు పంచాయతీ అరవపాలెంలో శుక్రవారం సార్ఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రూత్ బెనీమి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు బోగిరి ప్రభాకర్, ఎల్ మాధవరావు హాజరైయ్యారు. చెడు వ్యసనాల జోలికి పోకుండా మంచి నడవడిక కలిగి జీవించాలన్నారు. సమాజ సేవ చేస్తున్న సార్ఫ్ సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు హేమలత, గౌతమి, నాగిణి, రూపా, లక్ష్మీ, స్థానికులు ఉన్నారు.

బోగోలులో మోస్తరు వర్షం

బిట్రగుంట, జూలై 19: బోగోలు మండలంలో శుక్రవారం తెల్లవారు జామున ఓమోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు వర్షపు చినుకులు పడుతూ చలిగాలి వీచింది. సాయంత్రం వర్షపు జల్లులు క్రమంగా పెరిగి ఓ మోస్తురు వర్షం కురిసింది.

సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

కలిగిరి, జూలై 19: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం వెలగపాడు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రికార్డు నిర్వహణపై సచివాలయ సిబ్బందికి సూచనలిచ్చారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందే సేవల్లో జాప్యం ఉండరాదన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కావలి టౌన్, జూలై 19: మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్షుడు తురకా శీనయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పట్టణ సంఘం సర్వసభ్య సమావేశం శీనయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన హెల్త్ అలెవెన్సులు, సమ్మెకాలపు జీతాలు, డైలీ కార్మికుల మూడు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నేతలు బిరదల రమేష్, ఓ రమేష్, పరుసు రమేష్, జలదంకి బాబు, క్రాంతి పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

కావలి టౌన్, జూలై 19: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు సముదాయంలోని బార్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం ట్రంకురోడ్డులో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా లోక్ అదాలత్ ఛైర్మన్ శోభ పాల్గొని మాట్లాడారు. వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని.. హెల్మెట్ వాడకం వలన ప్రాణ రక్షణ కలుగుతుందన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుశురామ్, అడిషనల్ పీపీ రామకృష్ణ, ఏపీపీ మృదుల, బార్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, జయప్రకాష్, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి పాల్గొన్నారు.